



జ్ఞాన యోగం


విచారణ

మాటలు – మంత్రాలు– 1








సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

మాటలు - మంత్రాలు

కర్త

డా. మోపిదేవి కృష్ణస్వామి

ఎం. ఏ., పిహెచ్.డి

కూర్పు:

వాడపల్లి చక్రపాణిరావు

ఎం. ఏ., ఎం. ఫిల్

ప్రచురణ


వరల్డ్ టీచర్ ట్రస్ట్ సోదరబృందం

అమలాపురం శాఖ

విషయానుక్రమణిక

సవరణలు :

పుట 8-పంక్తి 10- 'పెంచుకోవడమేనా' బదులు 'పిండుకోవడమేనా'అనీ, పుట 38-పంక్తి 2 - 'ఈ వృత్తివిద్యలవెంటపడిన' బదులు 'ఈఉత్తి విద్యలవెంటపడిన' అనీ చదువుకోవాలి.



1. మాస్టర్ ఇ. కె — మనం

- వారిది ఓమ్ - వారికి హోమ్
- రాళ్ళు కాదు - కుర్రాళ్ళు
- నిధులు కాదు - ప్రతినిధులు
- ప్రచారం కాదు - ప్రసారం

  యోగం వారికి - ఉపయోగం మనకి
- జేబునిబట్టిగాక విలువనుబట్టి

మాస్టరు ఇ. కె - మనం

హరిః ఓమ్ - హరికి హోమ్

అది బందరు - వివేకానంద మందిరం. తమను ఉద్దేశించి ప్రసంగించి, ఉత్తేజితులను చేయవలసిందిగా అచ్చటి సోదర బృందం కృష్ణస్వామిని కోరారు. కృష్ణస్వామి ప్రసంగాన్ని ప్రారంభిస్తూ "హరిః ఓమ్, శన్నోమిత్రః శం వరుణః......" అని ప్రార్థన చేసి, ఇలా అన్నారు:

"సమర్పణబుద్ధితో 'హరిః ఓమ్' అనగానే ఈ శరీరం హరికి 'హోమ్' గా రూపొందుతుంది. ఆ పైన 'అతడే' మన నుండి పలుకుతూ మనలను ఉత్తేజితులను చేస్తూ ఉంటాడు. ఇదీ నేనెరిగిన సత్యం. దీనినే గుర్తుంచుకోవాలి నిత్యం. ఈ స్పృహ మనకు కలిగి, మన మా స్పృహలో నిలబడగలిగిన కొద్దీ దేహం ద్వారా దివ్యజీవితం దేవుని లీలగా వ్యక్తమవుతుంది. ఈ సత్యాన్నే గుర్తు చేస్తూ మన పెద్దలు 'దేహమే దేవాలయం. జీవుడే సనాతనుడైన దేవుడు' అని దర్శనాత్మకంగా వివరించారు."

కృష్ణస్వామి పలుకులు వెలుగులు కాగా, అచ్చటి వారికి ఆత్మదర్శనం అరచేతి ఉసిరిక అయింది.

రాళ్ళు కాదు - కుర్రాళ్ళు

ఒకసారి ఒక పెద్దాయన కృష్ణస్వామిగారితో మాట్లాడుతూ "మాస్టరుగారు చేస్తున్న కృషిని గూర్చి విన్నాను. బాగానే ఉంది. అన్నట్టు ఆయన ఆశ్రమాల్లాంటివేమైనా స్థాపించారా? స్థాపిస్తే ఎక్కడెక్కడ ఉన్నాయి? వాటి వివరాలు తెలుపుతారా?" అన్నారు.

అప్పుడు కృష్ణస్వామి, "మాస్టరుగారికి ఆశ్రమాలను కట్టడంలో కన్న, వ్యక్తుల వ్యక్తిత్వాలను తీర్చి దిద్దడంలోనే ఆసక్తి ఎక్కువ. తన శక్తియుక్తులన్నీ అలసినవారికి సేద తీర్చడంలోనూ, వలసినవారికి శిక్షణ నివ్వడంలోనూ ఖర్చు పెడుతున్నారాయన. ప్రేమపూర్వకమైన సేవద్వారా సేద తీరుస్తున్నారు. ప్రవర్తనతో కూడిన ప్రబోధం ద్వారా శిక్షణ నిస్తున్నారు.

"పెద్దలైనవారు తమకు కోరి దగ్గరైన వ్యక్తులను ప్రయోజకులుగా, సమర్థులుగా, సమాజానికి పనికివచ్చే వారుగా తీర్చిదిద్దడంపైన దృష్టి పెట్టకుండా, వారి నుండి చందాలు రాబట్టి, ఆశ్రమాలు నిర్మాణం చేసి, ధర్మసంస్థాపన జరిగింది అనుకుంటే, అది పొరపాటే అవుతుంది. ఆ ఆశ్రమాల్లో తమ తరువాత దీపాలు పెట్టేవాళ్ళకోసం వెతు

కోవలసిన గతి పడుతుంది. అందుకే మాస్టరుగారు వ్యక్తులను సజీవ ఆశ్రమాలుగా తీర్చి దిద్దడమే ఉద్యమంగా పెట్టుకున్నారు. ఆయనకు కావలసింది ఆశ్రమాలకు పనికొచ్చేవాళ్ళు కాదు; సమాజాన్ని సరిచేసే కుర్రాళ్ళు.

"ఎంతోమంది గృహస్థులు మాస్టరుగారి వెలుగులో తమ గృహాలనే పవిత్రమైన ఆశ్రమాలుగా, సేవాకేంద్రాలుగా రూపొందించుకొంటున్నారు. గృహస్థాశ్రమం అన్న మాట పెద్దలు ఎందుకు వాడారో ఆ గృహాలను చూసినప్పుడు మనకు బోధపడుతుంది.

"శిక్షణ పొందేవారి సంఖ్య పెరిగినప్పుడు ఆ శిక్షణ కొరకు తగిన ఏర్పాట్లు చేసుకోవడం తప్పుకాదు. పైగా తప్పని సరి కూడాను. దానికి కావలసిన ప్రయత్నాలు ఈ మధ్యనే భౌతికకక్ష్యలో ప్రారంభమవుతున్నాయి. ఈ ప్రయత్న ఫలితంగా వేలాది వ్యక్తులు సాధకులుగా, సేవకులుగా శిక్షణ పొందేటందుకు కావలసిన సౌకర్యాలు ఏర్పడనున్నాయి. వ్యక్తులకు సౌకర్యంగా ఉండడానికి సంస్థలు, కట్టడాలు రూపు కట్టుకోవడం మంచిది కాని, సంస్థలను ముందు ఏర్పాటుచేసి, ఆ ఏర్పాటు చేయడంలో కాలహరణం జరిగి, ఆపైన ఆ సంస్థలో శిక్షణ పొందేవారి కోసం, ఆ సంస్థను పోషించేవారి కోసం వీథిని పడడం ఏమంత మంచిపని ? ఉద్దేశం మంచిదే అయినా, ఉపయోగం లేకుండా పోతుంది. శిక్షణ ఈయవలసిన వ్యక్తి శిక్షణ నీయడం మాని, కట్టడాలు కట్టడం

మొదలుపెడితే, వంటవాడు వంటచేయడం మాని పేళ్ళు వేస్తూ కూర్చున్నట్టవుతుంది. శిక్షణ నిచ్చేవాడు శిక్షణ ఇస్తూ ఉంటే, ఆ శిక్షణ పొందేవారు తమకు అవసరమనిపించినపుడు తగిన సౌకర్యాలను తామే కల్పించుకుంటారు. కావలసిన సలహాలు, సూచనలు మాత్రం బాధ్యతతో శిక్షకుడు అందిస్తే సరిపోతుంది. మాస్టగారు ఇప్పుడు చేస్తున్న దదే.

"ఇల్లు కట్టుకోవడం, పొలాలు, సంపదలు, హోదాలు పెంచుకోవడంలో పడి, పిల్లలకు శిక్షణనిచ్చే తీరుబడి లేక, చివరి దశలో చెడిపోయిన బిడ్డలను చూసి, దుఃఖించే తండ్రి గతిఎలాంటిదో, ఆశ్రమాల నిర్మాణం పేరిట చందాల సేకరణ, వనరుల సమీకరణల్లో పడి, తనతో ఉన్నవారికి శిక్షణ నిచ్చే తీరిక లేక, ఊరూరా తిరుగుతూ ఉండే శిక్షకుల గతి కూడా అంతే అవుతుంది."

కృష్ణస్వామిగారి వివరణ అవతలి వ్యక్తిని ఆలోచనలో పడవేసింది. ఆయన తన సులోచనాల్ని తుడుచుకుంటూ, కృష్ణస్వామి వైపు తేరిపారజూస్తూ ఉండిపోయాడు కొంత సేపు. తేరుకోవడానికి ఆ మాత్రం సమయం పట్టదా మరి ?!

నిధులు కాదు — ప్రతినిధులు

"మాస్టరుగారు అనేక ప్రాంతాల్లో ఉచిత హోమియో వైద్యాలయాలు నిర్వహిస్తున్నారు కదా ! ఈ వైద్యాలయాలు నడవడానికీ, సేవాకార్యక్రమాలు సాగడానికి

నిధులు ఎలా సమకూరుస్తున్నారు ?" అని అడిగారొకాయన, కృష్ణస్వామిని.

కృష్ణస్వామి ఇలా అన్నారు - "నిధులు ఉంటే సేవా కార్యక్రమాలు నడచిపోతాయనా మీ ఉద్దేశం ? నిధులు మూలుగుతున్నవాళ్ళున్నారు. వాళ్ళు ఈ మూలుగుతున్న ప్రజానీకానికి ఏంచేయగల్గుతున్నారు ? ముందు మనకు హృదయమున్న వ్యక్తులు కావాలి. జీవితాన్నే సేవగా మలుచుకోవాలన్న దీక్షకలిగిన వ్యక్తులు కావాలి. అలాంటి వ్యక్తులు అరుదైతే, కరువైతే ఏంజరుగుతుందో ప్రభుత్వంవారు తెరచిన ఉచిత వైద్యాలయాలు, ఇతర కార్యాలయాలు, మనకు నిరూపిస్తున్నాయి. వాటికి నిధులున్నాయిగా ! కాని, పని జరుగుతున్న దెంతవరకు ? అందుకే మాస్టరుగారు 'నాకు మనీ పవర్ కన్న మాన్ పవర్ ముఖ్యం. నేను ఒకవేళ అర్థిస్తే, తయారుచేయడానికిగాను మీ బిడ్డలను అర్థిస్తాను గాని, మీ సంపదలను అర్థించను' అని నొక్కి చెబుతూ ఉంటారు.

"సరైనవ్యక్తి కర్తవ్యోన్ముఖుడైనప్పుడు నిధులు వాటికవిగా నడిచి వస్తాయనేది సృష్టిలోని సత్యం. సముద్రంలోనికి నదులు వాటికవిగా వచ్చిపడటంలేదా ? మనకిప్పుడు కావలసింది నిధులుకాదు; ప్రతినిధులు. ప్రతినిధులు ఉన్నప్పుడు ప్రతి నిధీ సద్వినియోగ మవుతుంది. నిధుల సామర్థ్యం చేత

ఆకర్షింపబడతాయితప్ప, కర్తృత్వ చేత ప్రోగుచేసుకోవడానికి వీలయ్యేవి కావు. వాటివైపు ఆశతో చూస్తున్నవాణ్ణి అవి అందీ అందక ఆడించేస్తాయి. తన కర్తవ్యం వెంట తాను వెళుతున్నవాడి నవి వెంటబడి సేవిస్తాయి. మాస్టరుగారు తాను అనుభవిస్తూ, సహచరులచేత అనుభవింపజేస్తున్న ముఖ్యసూత్రాల్లో ఇది ఒకటి."

మాస్టరుగారి సందేశానికి కృష్ణస్వామి చెప్పిన భాష్యం వింటున్న వ్యక్తికి వెలుగుదారి చూపించింది. ఆయన 'మీరు చెప్పింది అక్షరాలా నిజం' అంటూ కృష్ణస్వామి చెప్పిన మాటలను మననం చేసుకోసాగాడు.

ప్రచారం కాదు – ప్రసారం.

"మాస్టరుగారు హిందూమత ప్రచారానికి నడుం కట్టుకున్నారు కదా, వారి ఉపన్యాసం మనగ్రామంలోకూడా పెట్టిస్తే బాగుండేదే. మీరా ప్రయత్నం ఎందుకుచేయలేదు?" అన్నాడొక గ్రామస్థుడు.

కృష్ణస్వామి చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నారు: "ఉపన్యాసం కావాలో అక్కర్లేదో నిర్ణయించవలసింది నేను కాదు, మీ గ్రామపెద్దలు. మీకు కావాలి అనిపిస్తే దొడ్డిదారు లక్కర్లేదు. డైరెక్టుగా మాకిది కావాలి అని ఆయననే కోరవచ్చు. "ప్రచారానికి పూనుకున్నప్పుడు మన గ్రామానికి కూడా వచ్చి, చెప్పవలసిన బాధ్యత ఆయనకు లేదా ?" అని

మీరు భావిస్తున్నట్లు నాకనిపిస్తున్నది. ఆయన ప్రణాళిక తగు మాత్రం వివరిస్తాను. ఆయన చేస్తున్నది ఉపన్యాసాలు కావు; ఉపదేశాలు. ఆయన ఉపదేశిస్తున్నది హిందూమతాన్ని కాదు; మానవధర్మాన్ని. ఆయన ద్వారా జరుగుతున్నది ప్రచారం కాదు; ప్రసారం. ఆయన ధర్మాన్ని బోధగా కాక, మనిషి నుండి మనిషికి స్పర్శగా ప్రసరింపజేస్తున్నవారు. అయస్కాంతం ఇనుపముక్కని స్పృశించినట్లు - సూర్యకిరణం కమలాన్ని స్పృశించినట్లు మానవజాతిని తన మాటలతో చేతలతో స్పృశించి మేల్కొల్పుతున్నవారు. మేల్కొనాలన్న తపన కల్గినపుడు మాత్రమే ఆయన స్పర్శ మనకు లభించేది. సిద్ధపడని వాణ్ణి పట్టుకు తోమేవాడు పిచ్చివాడవుతాడు కాని పరమగురువు కాడు."

కృష్ణస్వామి వివరణకు అవతలివ్యక్తి కొంచెం సిగ్గుతో తలవంచుకుంటూనే ఆయన వేసిన చురకలకు తగిన రీతిలో స్పందించి తనలో తాను ఆలోచించుకుంటున్నట్లుగా కనిపించాడు. కావలసిందదేగా మరి !

యోగం వారికి _ ఉపయోగం మనకి

1983 జనవరి గురుపూజల్లో, మాస్టరుగారి తత్వాన్నీ, వ్యూహాన్నీ విశదీకరిస్తూ కృష్ణస్వామి, "మాస్టరుగారంటే భారతీయులకు మొదట వైద్యునిగా తెలుసు. తరువాత ఆధ్యాత్మికవేత్తగా తెలుసు. విదేశీయులకు ఆయన మొదట ప్రవక్త, ఆ తరువాత వైద్యుడు. విదేశీయులు ఆయననుండి

లభించే ఆత్మవిద్యకు అర్రులుచాస్తూ ఉండగా, భారతీయులు ఆయననుండి లభిస్తున్న సేవకు మాత్రం వెంటబడుతున్నారు. మాస్టరుగారు ప్రేమమయులు కనుక, విదేశీయులకు వారు కోరిన యోగాన్నీ, భారతీయులకు వారికి కావలసిన ఉపయోగాన్నీ సహజమైన చిరునవ్వుతో ఏక కాలంలో అందిస్తున్నారు. విదేశాల్లో వెలుగును ఎక్కువగా పంచిపెడుతూ ఇక్కడ మాత్రం మనకు కావలసిన పనిని ఎక్కువగా చేసి పెడుతున్నారు.

"రోగులుగా ఆర్తులుగా ఉండిపోతూ ఆయననుండి సేవను పెంచుకోవడమేనా మనం చేయగలిగింది ? ఆయన శంఖారావం విని వికసించేందుకు మన జాతి నోచుకోలేదా ? ఇప్పటికే అలసులమై ఆలస్యం చేశాం. సోమరులమై ఆ వెలుగు యెడల ఏమరపాటు చెందుతూ వచ్చాం. ఈ అవలక్షణాల నుండి మనం బయటపడదల్చుకుంటే తప్ప, మాస్టరుగారు చూపిస్తున్న విశ్వరూపం మనకు సాక్షాత్కరించదు. నవతర నిర్మాతగా ఆయన ఇస్తున్న చేయూత మనకు లభించదు."

ఇలా సాగిన కృష్ణస్వామి ప్రబోధం వింటున్నవారిని ఒక కుదుపు కుదిపింది.

జీలు (Zeal)ను బట్టిగాక — వీలునుబట్టి

మాస్టరుగారి వ్యూహాన్నీ, మన కర్తవ్యాన్నీ విశదీకరిస్తూ పై సందర్భంలోనే కృష్ణస్వామి ఇంకా ఇలా అన్నారు: "అయితే మనలో కొందరం మాస్టరుగారి ద్వారా సేవ

పొందడమేగాక, మాస్టరుగారిలాగ సేవ చేయడానికి యత్ని స్తున్న వాళ్ళం ఉన్నాం కదా" అని మనం అనుకోవచ్చు. కొద్దిగా ఆత్మపరిశీలన చేసుకుంటే, మనకొక సత్యం తెలుస్తుంది. మాస్టరుగారి విదేశీ శిష్యుడు 'జీలు'ను బట్టి పని చేస్తూ ఉండగా, భారతీయ శిష్యుడు వీలునుబట్టి మాత్రమే పనిచేస్తున్నాడు.

"విదేశీయులలో మాస్టరుగారు చూపుతున్న ప్రణాళికకు జీవితాలు సమర్పణ చేసుకొంటున్న స్త్రీ పురుషుల సంఖ్య చూస్తే, భారతీయులమైన మనకు ఆశ్చర్యమే కలుగుతుంది. ఎందుకంటే, మనం మన పనులనుకొన్నవాటి నన్నిటినీ చేసుకొని, మిగిలిన 'టయిం'లో మాస్టరుగారు చూపించిన మంచి పనిని చేయడానికి చూస్తున్నాం. అంతే నంటారా కాదా? భారతీయుడు తన దినచర్యలో మాస్టరుగారికి కొంచెం చోటుపెట్టడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు. విదేశస్థుడు తన జీవితాన్ని ఆయన ప్రణాళికకు అనుగుణంగా మలచుకొని, రాకెట్ స్పీడుతో విశ్వశ్రేయస్సుకోసం పని చేస్తున్నాడు. కాస్సేపు మంచి పనిచేసి, తృప్తిపడిపోయే అల్పసంతోషులమైన మనకూ, విశ్వంమొత్తానికి కావలసిన పని చేయడానికి నడుంకట్టిన 'రూడాల్ఫ్' వంటి యూరప్ దేశస్థునికీ ఎంత తేడా ఉంది! అందుకే వారు 'జీలు'నుబట్టి చేస్తుంటే,

మనం పీలునుబట్టి మాత్రమే పని చేస్తున్నాం అన్నాను. మనకూడా 'జీలు'నుబట్టి పనిచేసే మంచి రోజులు రావాలి."

కృష్ణస్వామి విశ్లేషణ శ్రోతలను ఆలోచనలో పడ వేసింది. వారిలో చాలామంది ఆత్మపరిశీలన చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టు కనిపించింది.

2. తీరనిబాధ _ తీరైనబోధ

- తప్పు జరిగిందనడానికి లేదు-తట్టుకోవడమే కష్టంగా ఉంది
- మరచిపోవడం కాదు మలచుకోవడం
- ఋణానుబంధం కాదు క్రీడానుబంధం
- ఉన్నవాళ్ళకేగా చేయగలిగింది
- బాధపడటం తప్పుకాదు - బాధ్యతనే విడువరాదు
- నిస్వార్థమైన మమకారమే పరమప్రేమగా రూపొందుతుంది
- భారతం వ్రాసినవాడే బాధపడ్డాడు
- దేహాలు అశాశ్వతంకాని, జీవితాలు శాశ్వతమే
- సైనికుడినై సాహసిస్తాను

తీరని బాధ-తీరైన బోధ

తప్పు జరిగిందనడానికి లేదు-
తట్టుకోవడమే కష్టంగా ఉంది

"ఇన్ని సంవత్సరాలుగా నిరంతరం అదేపనిగా మీరు సేవచేస్తున్నారు. అలాంటి మీకు దేవుడు ఇలాంటి శిక్ష విధించవచ్చా? ఇది న్యాయమా?" అన్నారొక ఆత్మీయులు, కృష్ణస్వామిని అనునయించడానికి ప్రయత్నిస్తూ.

అంత బాధలోనుండీ కృష్ణస్వామి ఇలా అన్నారు -

"దైవాన్ని తప్పుపట్టడానికి అవకాశం లేదు. అతడి ప్రణాళిక ప్రకారం అతడు ఘట్టాలు నడిపిస్తున్నాడు. కాకపోతే, సాగుతున్న మన అనుభూతికి తీవ్రవిఘాతం కలగడంతో మనమే తట్టుకోలేకపోతున్నాం. బాధ, ఆపేక్ష మన మమకారానికి సంబంధించినవి. సంఘటన దేవుడి ప్రణాళికకు చెందినది. ఇచ్చినప్పుడు ఎందుకని ప్రశ్నించామా, తీసుకు వెళ్ళినప్పుడు ప్రశ్నించగలగడానికి? తప్పు జరిగిందనడానికి లేదు. కానీ, తట్టుకోవడమే కష్టంగా ఉంది."

కృష్ణస్వామి కనులవెంట దుఃఖం పొంగి పొరలింది.

మరచిపోవడం కాదు – మలచుకోవడం

"చెప్పినంత తేలిక కాదనుకోండి. ఎలాగైనా ఈ సంఘటనని మరచిపోవడానికి ప్రయత్నం చేయండి. తప్పదుమరి. కాలం ఎలాగూ కొంత సహకరిస్తుందనుకోండి" అన్నారు కృష్ణస్వామిని చూడవచ్చిన సన్నిహితులొకరు.

"మరచిపోవడం సాధ్యమూ కాదు, కర్తవ్యమూ కాదు. ఇన్నాళ్ళూ మనతో సహచరించి వెలుగులు నింపిన వ్యక్తిని, భౌతికంగా దూరమైనంత మాత్రాన మరచిపోవడమంటే అది కృతఘ్నతే అవుతుంది. చేయవలసింది మరచిపోవడం కాదు; బాధను అనుభూతిగా మలచుకోవడం. దానికి కొంత కాలం పడుతుంది. పట్టనివ్వండి. కృష్ణుడు బృందావనాన్ని విడిచినప్పుడు గోపికలు బాధతో విలవిల్లాడిపోయారు. కాలక్రమంలో ఆ బాధ అనుభూతిగా రూపొందగా నిరంతర కృష్ణ సాన్నిధ్యంలో వారు జీవించారు.

"నాకూ అదే అవస్థగా, అదే గమ్యంగా గోచరిస్తోంది" అన్నారు కృష్ణస్వామి.

ఋణానుబంధం కాదు – క్రీడానుబంధం

"మీరు గుండె దిటవు చేసుకోవాలి. మనకు ఋణం తీరిపోయింది. అంతే అనుకోవాలి. ఋణం తీర్చుకోవడానికి వచ్చాడు, తీర్చుకుని వెళ్ళిపోయాడు. 'ఋణానుబంధ రూపేణ

పశు పత్నీ సుతాలయః' అన్నారు పెద్దలు" అన్నారొక సన్ని హితులు, కృష్ణస్వామిని ఓదార్చడానికి ప్రయత్నిస్తూ.

కృష్ణస్వామి తలపైకెత్తి, అన్నవారి కన్నుల్లోకి సూటిగా చూస్తూ, "ఇది ఋణానుబంధం కాదు; క్రీడానుబంధం. మనిషికీ మనిషికీ మధ్య నున్నది ఋణానుబంధమేనా? ఇది చాలా నీచమైన దృష్టి. అప్పులు తీర్చుకోడానికేనా ఈ జన్మలన్నీ? జమాఖర్చుల లెక్కకేనా ఈ సృష్టి? దారుణమైన ఆలోచన. ఈ ఆలోచన. మనిషి హృదయం రాయిలా గట్టిపడడానికి పనికివస్తుందిగాని, ప్రేమగా ద్రవించి, అనుభూతిగా పర్యవసించడానికి పనికిరాదు."

అవతలి వ్యక్తి ఇంకొంత వివరం కావాలన్నట్టు ఆర్తితో చూస్తున్నాడు.

కొద్దిసేపాగి, కృష్ణస్వామి మళ్ళీ ఇలా అన్నారు:

"మొదట దైవం తాను అనేకం కాగోరగా ఈ సృష్టి వచ్చింది* అని మనకు వేదోపనిషత్తులు చెబుతున్నాయి. ఆ కోరికతోనే అనేకమైన మూర్తులు ధరించి, ఆ దైవం లీలగా క్రీడిస్తున్నట్టు భాగవతం కీర్తిస్తోంది.♦ క్రీడ, లీల అని ఋషులు చెబుతూ ఉండగా, కర్మబంధం, ఋణసంబంధంగా పండితులు జమకట్టారు. ఎదుటి మనిషిని దైవంగాచూస్తే ముక్తస్థితిని

* సోఽకామయత బహుస్స్యాం ప్రజాయే యేతి

♦ నర్తకుని భంగి పెక్కగు మూర్తుల నెవ్వడాడు

పొందుతావు అని ఋషులు చెప్పగా, తోడిమనుషులను వదిలించుకుంటే దేవునికి దగ్గరౌతామని మెట్టవేదాంతులు భ్రమపడ్డారు. సర్వమూ ఆయన క్రీడ అయినప్పుడు, ఈ మూర్తులన్ని ఆయనవే అయినప్పుడు మూర్తికీ మూర్తికీ మధ్య నున్నది పూర్తిగా క్రీడానుబంధమే కదా !"

"అయితే కర్మ సిద్ధాంతం నిజం కాదంటారా? ఆ వ్యక్తి" అడిగాడు.

"కొంతవరకే" అంటూ కృష్ణస్వామి ఇలా వివరించ సాగారు-

"ఒక ఆటస్థలంలో ఆటగాళ్ళు కొందరు చేరి తమ ఆనందం కోసం ఆడుకోవడానికి ఉపక్రమిస్తారు. ఆట ఒకసారి ప్రారంభమయిన తరువాత పాయింట్లు రావడం, పాయింట్లు పోవడం, గెలవడం, ఓడడం, దానిని బట్టి మళ్ళీ మళ్ళీఆడుతూ ఉండడం జరుగుతూ ఉంటుంది. ఆడుకుంటున్నది ఈ గెలుపు ఓటములను లెక్కపెట్టుకోవడం కోసం కాదని, ఆనందం కోసమని గుర్తున్నంతవరకు గెలుపు ఓటములు వారిని బంధించవు; బాధించవు. అవే ముఖ్యమనుకున్నవారిని అవి బంధించకమానవు. భూమి అనే క్రీడారంగంపై సృష్టిక్రీడ ప్రారంభమైన తరువాత దేహాలు ధరించిన ఆటగాళ్ళుగా మన కథా అంతే. కాబట్టే లాభనష్టాలు, జయాపజయాలు, సుఖదుఃఖాలు మొదలైన ద్వంద్వాలకు అతీతంగా ఉంటే తాను అనుభవానికి వస్తానని గీతలో భగవానుడు చెప్పాడు.

లాభనష్టాదులపైన దృష్టి ఉన్నవారికి సన్నివేశాలు ఋణాను బంధాలు. అంతర్యామిపైన దృష్టి ఉన్నవారికి అవి క్రీడాను బంధాలు. అందుకే కర్మసిద్ధాంతం కొంతవరకే అన్నాను నేను. ఆటలో హద్దులు, బద్దెలు, నియమాలు, అవుటయి పోవడాలు ఉండవని కాదు, ఉంటాయి. కానీ ఆట ఆనందం కోసమని గుర్తున్నంతవరకు అవి మనని ఉత్సాహపరుస్తాయే తప్ప, ఏడిపించవు.

"అన్నిటికన్న పైనున్న సత్యం ఏమిటంటే, కర్మ తాను చేస్తున్నాను అని భ్రమపడినవారికి, కర్మబంధం ఉంటుంది. కర్మ తమనుండి జరుగుతున్నది అని దర్శించినవారికి ఆ బంధం స్థానంలో అనుబంధం, ఆనందం ఉంటాయి. సారాంశ మేమిటంటే, వేదాంతం పేరిట ఎండిపోకండి అని. తోటి జీవులను బంధాలుగా ఋణసంబంధాలుగా చూసే నీచస్థితికి దిగజారకండి, వారిని దైవస్వరూపంగా దర్శించి, వారి ఆరాధనగా జీవితాన్ని మలచుకోండి, వారి మూర్తులు దూర మైనా గోపికల్లా మధురస్మృతులు జ్ఞప్తిచేసుకుంటూ తరించండి అని".

"ఇంత బోధలోనూ మిమ్మల్ని ప్రశ్నించి ఎక్కువ సేపు మాట్లాడించాను. మీ మాటలు అమృతప్రాయమైనవి. అయినా ఈ సందర్భంలోకూడా..."

"ఫరవాలేదు. మీరు ప్రశ్నించడంవల్ల మరొకసారి సత్యదర్శనం పొందే ప్రయత్నం నాలో జరిగింది. ఆ దర్శ

నాన్ని నాకు అందించేటందుకు నిమిత్తంగా మీరిక్కడ ఉన్నారు'' అంటూ కృష్ణస్వామి అరమోడ్పు కన్నులతో ఒక విధమైన అనుభూతితో నిలిచారు.

ఉన్నవాళ్ళకేగా చేయగలిగింది!

"ఇంత బాధలో ఉండికూడా ప్రత్యేకంగా మా ఊరు మనిషిని పంపించి, నన్ను రప్పించి, మందిస్తున్నారు మీరు. అలాంటి మీకు ఇంత బాధపెట్టాడా దేవుడు!" అంటూ కళ్ళ నిండా నీళ్ళు నింపుకుంది ఒక స్త్రీమూర్తి.

"శరీరంలో లేనివాడికి నేనేం చేయగలనమ్మా? ఉన్న వాళ్ళకేగా చేయగలిగింది!" అంటూ బాధతోకూడిన వాత్స ల్యంతో చూశారు కృష్ణస్వామి.

బాధపడడం తప్పుకాదు – బాధ్యతనే విడువరాదు

"నీవిలా కుమిలిపోకూడదు. నువ్వే ఇలా అయితే, మిగిలినవాళ్ళు ఏమవుతారు? ఏదో ఒక వ్యాపకం పెట్టుకుని, నిన్ను నువ్వు తమాయించుకోవాలి. నువ్వు మా అందరికీ చెప్పగలిగినవాడివి. మీకు మే మేం చెప్పగలం?" అన్నది కృష్ణస్వామి చెల్లెలు కళ్ళనిండా నీళ్ళు నింపుకుని.

"బాధ కలుగుతున్నప్పుడు పడకుండా ఉండడం ఎలా సాధ్యమమ్మా? బాధపడడం తప్పుకాదు. బాధ్యతనే విడిచిపెట్ట

గూడదు. నాకు వేరే వ్యాపక మెందుకు? నా కర్తవ్యమే నా వ్యాపకం. నేను చేస్తున్నది, చేయవలసినది ఇంత ఉండగా వ్యాపకాన్ని వెతుక్కోవడ మెందుకమ్మా?

"చెప్పగలిగినవాడిని అన్నావు. నాకు తెలిసింది చెబుతాను విను. ఎంత బాధ కలిగినా ఫరవాలేదు. ఆ బాధ, దానికి కారణంగా కనపడుతున్నవారిమీద విద్వేషంగానో, ఎదురుగానున్న కర్తవ్యం యెడల వైముఖ్యంగానో మారకుండా ఉండడమే కావలసింది. రాముడు తనకు కలిగిన బాధనంతటినీ అలాగే అనుభవించాడు. అందుకే మానవులకు ఆదర్శమయ్యాడు" అంటూ వివరిస్తున్న కృష్ణస్వామి రామగాథ లోతులలోనికి మానసికంగా ప్రవేశిస్తున్నట్టు కనిపించారు.

నిస్స్వార్థమైన మమకారమే
పరమప్రేమగా రూపొందుతుంది

"అన్నీ తెలిసినవారు మీరు. మిమ్మల్ని ఓదార్చగలగటం మాకెలా సాధ్యం? కానీ మీరు బాధపడుతుంటే చూడలేం. తట్టుకోవాలి మీరు. ఎంతైనా ఆ మమకారపాశం గట్టిది కదా! అది మనిషిని కుదిపివేస్తుంది" అన్నారు సన్నిహితులొకరు కృష్ణస్వామిని చూడవచ్చి.

"స్వార్థపూరితమైన మమకారం పాశమన్నమాట నిజమే. కాని నిస్స్వార్థమైన మమకారం ప్రేమగా, పరమ

ప్రేమగా రూపొందగలిగిన దవుతుంది. నేనిప్పుడూ అతడు చూపిన వెలుగును. అతని సాహచర్యంలోని తీపిని తలచుకొని దుఃఖిస్తున్నాను తప్ప, ఇంక దేనినీ ఆశించికాదు. గోపికలు, కృష్ణుడు తమను విడిచి వెడుతున్నప్పుడు ఆ ఎడబాటుకు బాధతో సుళ్ళుతిరిగిపోలేదా ? కానీ ఏం జరిగింది ? ఆ బాధే క్రమంగా జీవితానుభూతిగా రూపొందింది. కృష్ణుడే వారికి జగమంతా కనిపించేటట్టు చేసింది. ఆపైన నిరంతర కృష్ణ సాన్నిధ్యంలో వాళ్ళ జీవితాలు వేణుగానంగా సాగాయి. నిస్వార్థమైన వాళ్ళ మమకారమేగా ఇంతటి దివ్యస్థితిని వాళ్ళకు అనుగ్రహించింది ! వారిలాంటి బాధే ఇదికూడా. కానీ కృష్ణుడు వారి బాధను కాదన్నాడేమో చూశారా ! బాధపడటం తప్పన్నాడేమో చూశారా ! అతనికి తెలుసు-నిస్వార్థమైన ఆ మమకారమే వాళ్ళ జీవితాల్లో తన సాన్నిధ్యాన్ని నింపగలదని" అంటూ కృష్ణతత్త్వాన్ని స్మరించారు కృష్ణస్వామి.

భారతం వ్రాసినవాడే బాధపడ్డాడు !

"మీరు భారత భాగవతాలు తెలిసినవారు. తత్త్వజ్ఞానాన్ని మీకు వివరించటానికి యత్నించడం సాహసమే అవుతుంది. మీరు ఈ బాధనుండి త్వరలో తేరుకోవాలని కోరుకుంటున్నాను" అన్నారు ఆత్మీయులైన ఒకరు.

"భారత భాగవతాలను మనకెవడు భిక్షపెట్టాడో ఆ వ్యాసుడికే ఈ బాధ తప్పలేదు. కావాలని ఈశ్వరుణ్ణి

కోరి శుకుణ్ణి పుత్రుడుగా పొందాడు. శుకుడు పుట్టుసిద్ధుడై స్త్రీ పురుష భేదానికి అతీతంగా దివ్యత్వంతో వర్తించడం చూసి ఆనందించాడు. తాను దిగివచ్చిన ప్రణాళిక పూర్తి కాగానే శుకుడు ఉత్తరదిక్కుగా బయలుదేరి, చుట్టూ ఉన్న చెట్లకు పొదలకు "మాతండ్రి నా వెనుక నాకోరకై వస్తూ నన్ను ఆర్తితో పిలిచినపుడు నా బదులు మీరు పలకాలి సుమా" అని చెప్పి ముందుకు సాగుతాడు. వెళ్ళగా వెళ్ళగా రెండు పెద్ద కొండశిఖరాలు వస్తాయి. శుకుడి ప్రయాణం ఆగేదికాదని తెలిసి ఆ రెండు శిఖరాలు చూర్ణమైపోయి దారినిస్తాయి. శుకుడు వాయుపథాన్ని అతిక్రమించి సర్వ భూతాత్మకుడై పోతాడు. వ్యాసుడు శుకునిసంగతి తెలిసి శుకుడు నడిచినదారిని పట్టి "శుకా! శుకా!" అని పిలుస్తూ ముందుకు సాగుతాడు. శుకుడు సర్వభూతాత్మకు డయ్యాడని తెలిసి దీనవదనుడై ఒక కొండచివర బాధతో మూలుగుతూ నిలబడిపోతాడు. అప్పుడు శివుడు సాక్షాత్కరించి వ్యాసుణ్ణి ఓదార్చి ఇలా అంటాడు: "పంచభూతాలతో సమానమైన వీర్యంగల పుత్రుడు కావాలని కోరావు; పొందావు. మీ ఇరువురిగాథ శాశ్వతంగా నిలచిపోతుంది. తనకర్తవ్య నిర్వహణంచేసి తనువు విడిచాడతను. బిడ్డయెడల నీ ప్రేమ ఎట్టిదో నాకు తెలుసు. ఇకపైన నీ కుమారుని నీడ నీతో నడుస్తూ నీకు ఆలోటును తీర్చే ప్రయత్నం చేస్తుంది." వ్యాసుడు అప్పటికి కొంత ఊరట చెందుతాడు. జీవితాంతం తనతో నీడగా కలిసి సాగుతున్న పుత్రుని మూర్తిని చూసుకుంటూ కర్తవ్య నిర్వహణ చేస్తాడు.

"పరిశోధనకోసం భారతాన్ని చదువుతున్నప్పుడు ఈ ఘట్టం నన్ను నిలబెట్టింది. అప్పు డనిపించింది నాకు - వేదాంత మంటే గుండెను బండరాయిగా చేసుకోవడం కాదని. ఆర్ద్రిత లేని హృదయం అదీ ఒక హృదయమేనా? వ్యాసుడు పొందిన స్థితి అతనినేం తక్కువచేసింది? అతడి హృదయమార్దవాన్ని మనకు తెలియజేస్తుంది. గడ్డాలు మీసాలు నిస్స్వార్థమైన మమకారానికి అడ్డాలు కావని తెలియజెబుతుంది.

"ఇలాంటి సన్నివేశాలు, హృదయాన్ని కరిగించేవి, కరిగించి సంస్కరించేవి అనేకం పవిత్ర గ్రంథాలో ఉండగా, మెట్టవేదాంతం ఎక్కడనుండి వచ్చిందబ్బా అని ఆశ్చర్య పోయానప్పుడు. ఆనాడు ఈ ఘట్టం నన్ను నిలబెట్టింది. ఈనాడు విధే నన్ను అలాంటి ఘట్టంలో నిలపెట్టి, చూస్తోంది" అంటూ వ్యాసస్మరణతో కనులు మోడ్చారు కృష్ణస్వామి.

దేహాలు అశాశ్వతం కాని,
జీవితాలు శాశ్వతమే

సన్నిహితు లొకరు కృష్ణస్వామిని ఓదారుస్తూ, "మీకు తెలియనిదేముంది, అశాశ్వతమైన మానవ జీవితాలను గురించి!" అన్నారు.

కృష్ణస్వామి ఒక్కక్షణం మౌనంగా ఉండి ఆ వ్యక్తితో ఇలా అన్నారు: "మానవ దేహాలు అశాశ్వతమేగాని, మానవ జీవితాలు అశాశ్వతం కాదు సుమా! రాముడి గాథ, కృష్ణుడి

కథ, మహనీయుల జీవిత చరిత్రలు, మనకీ సత్యాన్ని స్పష్టం చేస్తున్నాయి. వాళ్ళు దేహాలువిడిచిపెట్టి ఎన్నివేల సంవత్సరాలయింది! అయినా వారి జీవితాలేమైనా పాతబడ్డాయా? అయితే అందరి జీవితాలూ అలా నిలబడవేం? అన్న ప్రశ్న వస్తుంది మనకి. దేహాలు ధరించినవారిలో రెండు రకాల వాళ్ళుంటారు - దేహంకోసం - బ్రతికేవాళ్ళు, ధర్మంకోసం బ్రతికేవాళ్ళు అని. దేహంకోసం బ్రతికేవాళ్ళకి దేహాన్ని పోషించుకోవడమే పరమావధి. దానికే వాళ్ళకి జీవితకాలం సరిపోతుంది. కాబట్టి దేహంతోపాటే ఆ జీవితాలుకూడా కాలగర్భంలో కలిసిపోతాయి. ధర్మంకోసం బ్రతికేవాళ్ళు ధర్మ నిర్వహణకొరకు దేహాన్ని ఒక పనిముట్టుగా స్వీకరించి లోకశ్రేయస్సు సాధించడంలో తమ పనితనాన్ని చూపిస్తారు. దేహాలు పడిపోయిన తర్వాత కూడా ఆ జీవితాలు, ఆ జీవితాల్లోని పనితనం ఆచంద్ర తారార్కం నిలచిపోతాయి. కాలకాలాల్లో తరతరాల మానవులకు పథనిర్దేశం చేస్తూ ఉంటాయి.

"వేదాదిత్య జీవితం కూడా ఆ కోవకు చెందినదే కనుక, అది శాశ్వతం. స్మరించుకోవలసినదేతప్ప, మరచిపోవలసినది కాదు."

మానవజీవితాల అనుపానులను లోతుపాతులను తడిమిచూస్తున్నది ఆయన **మనస్సు**.

సైనికుడినై సాహసిస్తాను

"బాబుని గూర్చిన ఇంత బాధలో ఉండి కూడా మీరు గ్రంథరచన చేస్తున్నారు. నాకు కావలసిన ప్రణాళిక లిస్తున్నారు. జాతిరుగ్ణతలను గూర్చిన విశ్లేషణను అందిస్తున్నారు. కర్తవ్యం నిర్దేశిస్తున్నారు. ఒకప్రక్క బాధ, మరొక ప్రక్క బోధ. మీ కెలా సాధ్యమౌతోందోగాని, ఆశ్చర్యంగా ఉంది నాకు" అన్నాను నేను.

కృష్ణస్వామి ఇలా అన్నారు :

"విదేశీయులు మన దేశాన్ని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నప్పుడు జరుగుతున్న ఆ యుద్ధంలో మాతృదేశ రక్షణకై కలిసికట్టుగా పోరు సలుపుతున్న, ప్రాణస్నేహితులైన ఇద్దరు సైనికులున్నారనుకో. ఆ ఇద్దరిలో ఒకడు ఆ పోరులో తూటాలు తగిలి, శరీరాన్ని విడిచిపెట్టాడనుకో. మిగిలినవా డేం చేస్తాడు ? స్నేహితునికోసం ఆక్రందించడం మానేస్తాడా? ఆక్రందించడంలో పడి, యుద్ధాన్నే మానేస్తాడా? ఆక్రందిస్తూనే యుద్ధం చేస్తాడు. ఆ బాధతోనే మరింత విజృంభిస్తాడు. తన స్నేహితుని బదులు కూడా తానే యుద్ధం చేస్తాడు. దేశరక్షణయెడల అతనిదీక్ష పెరుగుతుందితప్ప తగ్గదు. ఇక అతను విశ్రమించడు. తన ప్రాణానికి కూడా తెగించి, మరింత ముందుకు సాగుతాడు. సరిగా అలాంటి స్థితిలోనే ఉన్నానిప్పుడు నేను.

"నే పనిచేస్తున్న ప్రణాళికలో నా బిడ్డను కూడా ఒక సహచరునిగా భావించాను. అతడూ అలాగే ప్రవర్తించేవాడు. ఇంతలో అతడు దేహం విడిచాడు. నాకు బాధ పెరిగింది; కర్తవ్యమూ పెరిగింది. విశ్రమించవలసిన సమయం కాదిది. ఆ బాధ ఇచ్చిన ప్రేరణతో దేహాన్ని దివ్య ప్రణాళికకు మరింతగా అంకితం చేయడమే నేను చేయగలిగింది, నేను చేయవలసింది.

"దేహం బుద్బుదం వంటిదని మరొకసారి నిరూపించాడు, వెన్నుతట్టాడు వేదాదిత్య. ఏమో ఏ క్షణానైనా ఈ శరీరాన్ని అప్పజెప్పవలసి రావచ్చు. అంతలోపల నానుండి ఉద్దేశింపబడిన కర్తవ్యనిర్వహణం జరగాలి. అందుకే ఈ ప్రయత్నమంతా."

కృష్ణస్వామివదనం గంభీరంగా ఉంది. ఆ కళ్ళు కర్తవ్యోన్ముఖమైన చూపులతో దివ్యత్వాన్ని వెదజల్లుతున్నాయి.

మాత్రల వైద్యం - మాటల వైద్యం

చుట్టాలు వచ్చినా చట్టాలు తప్పకండి

ఒకసారి డిస్పెన్సరీలో రోగులను పరీక్షిస్తున్నారు కృష్ణస్వామి. ఒక స్త్రీ కేస్‌షీటును పరిశీలిస్తూ, "ఈ మధ్య అపథ్యం ఏం జరగలేదుకదా" అన్నారు.

దొరికిపోయామనుకుంటూ ఆవిడ "ఈమధ్య బంధువు లొచ్చారండి. మనం తినడంలేదుకదా అని వాళ్ళకెలా అలా పెట్టగలం చెప్పండి?" అంటూ సాగదీసింది.

"సందు దొరికిందికదా అని పసందుగా అన్నీ లాగించేశారన్నమాట. అసలు తినాలని ఉన్నది మనకి. చుట్టాలొచ్చారన్నది వంక. ఇలా అయితే మందులేం పని చేస్తాయి? చుట్టాలు వచ్చారంటే, నేనొప్పుకోవచ్చు కానీ, అవి ఒప్పుకోవుగా, చుట్టాలొచ్చినా చట్టాలు తప్పకుండా ఉంటేనే మందు పనిచేసేది" అని మందలించి, ఆవిడకు మందు వ్రాసి పంపించేశారు.

3. మాత్రలవైద్యం – మాటలవైద్యం

- చుట్టాలువచ్చినా చట్టాలు తప్పకండి
- పిల్లకాయలు కావాలా ? ఉల్లిపాయలు కావాలా ?
- ఏదో ఒక మందే పడాలి
- ఆస్తిపాస్తులు రాకపోయినా, అధివ్యాధులు వచ్చేస్తాయి
- మందుకు రావడమే కాదు, ముందుకురావాలి
- నెంబరా ? మెంబరా ?
- కాంపౌండ్‌లోకి వచ్చినవాడల్లా కాంపౌండరే
- రోగ్‌లులేరు, ఉన్నది రోగులే !
- అందుకున్నాను - అందుకు ఉన్నాను

ప్రక్కనున్న సహచరునితో "పథ్యం పేరిట ఇంద్రియ నిగ్రహానికి మంచి ట్రయినింగ్ పెట్టాడయ్యా వాడిమన్. రోగం కుదరడంతో బాటు పనిలోపని యోగం కూడా కుదిరి పోతుందినుమా" అన్నారు చిన్నగా నవ్వుతూ.

పిల్లకాయలు కావాలా ? ఉల్లిపాయలు కావాలా ?

ఒకావిడ తన ఇద్దరు బిడ్డలకు కృష్ణస్వామిగారిదగ్గర మందు ఇప్పిస్తోంది. శ్రద్ధ తక్కువగా ఉన్నట్టు గమనించి, "పథ్యం సరిగ్గా జరుగుతోందా?" అని నిలదీశారు కృష్ణస్వామి.

ఆవిడ జంకిన గొంతుతో "పిల్లలు తినకూడదనుకోండి. అందుకని మేం మానుకోలేం గదండి" అంది.

"అయితే వాళ్ళకి వేరే వండి పెట్టండి."

"రోజూ వేరే వండిపెట్టడం అంటే కష్టంగదండి."

"అయితే ఉల్లి, వెల్లుల్లి, మసాలాలు కొనడం పూర్తిగా మానేయండి."

"జిహ్వ ఎన్నాళ్ళని కట్టుకోగలమండి !"

"ఇదిగో ఏవమ్మా, నీకు కావలిసింది పిల్లకాయలో ఉల్లిపాయలో తేల్చుకో. ఉల్లిపాయలు కావాలంటే పిల్ల కాయల ఆరోగ్యం కుదుటపడదు. పిల్లకాయలు కావాలంటే ఉల్లిపాయలు తరగడానికి వీలుపడదు. ఏం ఏఁవంటావ్ ? ఎవరు కావాలి ?"

"పిల్లకాయలేనండి. మీరు చెప్పినట్టే, ఉల్లిపాయలూ అవీ మానేస్తాం. మరి వాళ్ళు బాగోవాలనేకదండి ఇదంతా" అంటూ మందు గ్రాయించుకొని నమస్కరించి వెళ్ళిపోయింది.

కృష్ణస్వామి ప్రక్కనున్న సహచరునితో "పాపం పిచ్చావిడ. ఉన్ననిజం ఒప్పుకుంది. ఎంతోమంది మనతో పథ్యం చేస్తున్నామని దబాయించి చెబుతూ, లోపల లాగించేస్తూ ఉంటారు. నష్టం వాళ్ళకేనని మర్చిపోతూ ఉంటారు" అన్నారు నవ్వుతూ.

ఏదో ఒక మందే పడాలి

ఒకరోజు ఒకతను మందుకు వచ్చాడు. కేసుషీటును పరిశీలిస్తూనే వాసన పట్టారు కాబోలు- "ఏంవోయ్! మందేమన్నా అలవాటుందేమిటి?" అన్నారు నవ్వుతూ.

"కొంచెంగా ఉందండి. సెమపడేవాళ్ళం కదండి. ఆమాత్తరం పడితేనేనండి బండి నడిసేది."

"ఆ మందుపడితే, ఈమందు పనిచేయదుమరి. ఏదో ఒక మందే పడాలి. ఏమందు కావాలో నీవే నిర్ణయించుకో."

అతను కొంచెంసేపు మైలమాటపడి, "మందు పని సేయదంటున్నారు కదండి. మరి తప్పదంటే మానేస్తానండి. సెడిపోయిన శరీరం కుదుటపడాలి కదండి" అని దణ్ణం పెట్టాడు.

"దాన్ని వదిలేయ్, దీన్ని మొదలెట్టు" అని మందు వ్రాసి పంపారు కృష్ణస్వామి.

ఆస్తిపాస్తులు రాకపోయినా ఆధి వ్యాధులొచ్చేస్తాయి

ఆస్త్మాతో బాధపడుతున్నానని ఒక స్త్రీ మందు తీసుకునేటందుకు వచ్చింది. ఆమె కేసుషీటు పరిశీలిస్తూ కృష్ణస్వామి, మీతల్లిదండ్రుల్లోగాని, వారి తల్లిదండ్రుల్లోగాని ఈ ఆస్త్మా లక్షణాలు ఎవరికైనా ఉండేవా అమ్మా?" అని అడిగారు.

"మా అమ్మమ్మగారికి ఉండేదండి. అలా పెద్దవాళ్ళ కుంటే వచ్చేస్తుందాండీ?"

"పెద్దవాళ్ళకు లేకుండా పెద్ద వ్యాధులేవీ పిల్లలకు డైరక్టుగా రావండి. ఆస్తిపాస్తులు వచ్చినా రాకపోయినా. ఈ ఆధివ్యాధులు మాత్రం తప్పకుండా వచ్చేస్తాయి. వారి డబ్బులకు వారసులమైనా కాకపోయినా, వాళ్ళ జబ్బులకు మాత్రం తప్పకుండా వారసుల మవుతాము."

ఆమెకు విషయం బోధపడి, "మాకు కలగబోయే పిల్లలకు కూడా వచ్చేస్తాయాండి?" అన్నది.

"మీరు నిష్ఠతో హోమియోమందు తీసుకుంటే వ్యాధి తత్త్వం కరిగిపోతుంది. ఆపైన కలగబోయే పిల్లలు

ఆరోగ్యవంతులవుతారు. తరంనుండి తరానికి సంక్రమించే దీర్ఘవ్యాధులను కరిగించివేయడమే హోమియోకున్న ప్రత్యేకమైన సద్గుణం. శ్రద్ధగా పథ్యంచేసి, బయటపడండి జబ్బునుండి" అంటూ ధైర్యం చెప్పారు కృష్ణస్వామి.

ఆమెకు తమ వంశమే ఆ వ్యాధినుండి బయటపడిన ట్టనిపించింది.

మందుకు రావడమేకాదు — ముందుకు రావాలి

ఒక యువకుడు క్రమబద్ధంగా మందు పుచ్చుకుంటు న్నాడు. చాలవరకు స్వస్థత పొందాడు. ఇదివరకు లేని చురుకుదనం, ఉత్సాహం, జిజ్ఞాసా అతనిలో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ఒకసారి అతను మందుకు వచ్చినప్పుడు మందు వ్రాసిఇస్తూ, "ఏంవోయ్, మీపరీక్షలైపోయినాయా?" అన్నారు కృష్ణస్వామి.

"అయిపోయాయండి"

"అయితే ఏం చేస్తున్నావ్ ?"

"ప్రస్తుతం ఖాళీగానే ఉన్నానండి"

"ఈ వయస్సులో ఖాళీగా ఉండటమేమిటోయ్?"

"మీరేదైనా చెబితే, చేయాలని ఉందండి."

"నీ వీలునుబట్టి రోజూనో, లేక ఆదివారంనాడో వచ్చి, మందులు కట్టిఇవ్వగలవా ?"

"వస్తానండి, ఆమాట నేనే అడుగుదా మనుకున్నా నండి."

"అందుకేనోయ్, నే కలగజేసుకున్నది. మందుకు రావడమే కాదు, ముందుకు రావాలి. ఎప్పుడూ పేషంట్‌గా ఉండిపోవడం అవమానం కాదుటోయ్ !" అంటూ వెన్నుతట్టి పంపారు కృష్ణస్వామి.

ఈరోజునుండి, నేనూ ఒక సేవకుణ్ణికదా అని పరవశించా డా యువకుడు.

నెంబరా ? మెంబరా ?

కొన్ని నెలలపాటు వైద్యసేవలో పాల్గొని, ఆమధ్య కనపడని యువకుడొకడు మందుకనివచ్చి, క్యూ ప్రకారం నెంబరు తీసుకొని వచ్చాడు. సర్వసామాన్యంగా సేవలో పాల్గొనే సభ్యుల కుటుంబాలకు ముందుగా మందిచ్చి పంపించే ఆచారం ఉన్నది. వారికి నెంబరక్కర్లేదు.

నెంబరు తీసుకుని వరుసలో వచ్చిన యువకుణ్ణి చూచి చిరునవ్వునవ్వి, 'ఇంతకూ నీవు నెంబరా, మెంబరా?' అన్నారు కృష్ణస్వామి.

మెంబరు స్థితినుండి నెంబరు స్థితికి జారిపోయినందు కా యువకుడు బాధతో సిగ్గుపడి, తలవంచుకున్నాడు.

కృష్ణస్వామి అతని భుజం తడుతూ "బాధపడ్డానికి కాదయ్యా నేనన్నది, **బోధ పడటానికి.** నీ ఆరంభశూరత్వాన్ని

ఆచరణశూరత్వంగా మలచుకో. మలచుకోవాలని గట్టిగా సంకల్పించుకో. మేమూ నీలాగ జారుతూ ఎగబ్రాకుతూ నేర్చుకున్నవాళ్ళమేలే" అన్నారు.

ఆ ప్రేమకు యువకుని కన్నుల్లో నీళ్ళు తిరిగాయి. మందు వ్రాయించుకున్న అతను మందులు కట్టడంలో ప్రవేశించి, పూర్వంకన్న ఉత్సాహంగా పని చేయసాగాడు.

కృష్ణస్వామి సహచరునివైపు తిరిగి, "మనకన్న చిన్న వాళ్ళని ట్రీట్ చేస్తున్నప్పుడు మన పెద్దవాళ్ళు మననెలా ట్రీట్ చేస్తూ వచ్చారో గుర్తుండాలి సుమా" అన్నారు, మాస్టరు ఇ. కె. ప్రేమను స్మరించుకుంటూ.

కాంపౌండ్‌లోకి వచ్చినవాడల్లా కాంపౌండరే

"మీదగ్గరకొస్తే బలే ఆశ్చర్యంగా ఉంటుందండి. ఒక వారం పేషంటుగా కనపడినవాడు మరి రెండు వారాల్లో మందులుకట్టి ఇచ్చేస్తూ ఉంటాడు. ఎక్కడైనా పేషంట్లు మందు పుచ్చుకుని వెళ్ళిపోవడం ఉంటుందిగాని, పేషంట్లు సేవకులుగా మారిపోవడం ఇక్కడే చూస్తున్నా!" అన్నా రొకరు ఆనందాశ్చర్యాలతో.

కృష్ణస్వామి ఇలా అన్నారు - "వచ్చినవాళ్ళను నేను పేషంట్లుగా చూస్తేకదా వాళ్ళు పేషంట్లుగా ఉండిపోయేది, వెళ్ళిపోయేది! వాళ్ళు నాకు పేషెంట్లుకాదు; పేటెంట్లు.

కాంపౌండ్‌లోకి వచ్చినవాడెల్ల నేడో రేపో కాంపౌండర్‌గా రూపొందడం, తర్వాత తర్వాత డాక్టరుగా స్థిరపడడం నా కెప్పుడూ అనుభవమే. మిగిలినచోట్ల ఇలా జరగడం లేదన్నారు మీరు. ఎలా జరగడమైనా, మన దృష్టినిబట్టి ఉంటుంది. వారు 'ఇన్‌కమ్' కోరుతున్నారు వ్యక్తులనుండి. మనం వ్యక్తులకు 'వెల్‌కం' చెబుతున్నాం. ఇన్‌కంకూ, వెల్‌కమ్‌కు తేడాలేదు మరి ?"

అడిగిన వ్యక్తి, సత్యదర్శనం పొంది సంతోషంతో పొంగిపోయాడు.

రోగ్‌లు లేరు-ఉన్నది రోగులే

"అవలక్షణాలు కలవాళ్ళని వాడుక్తరోగ్ అండి అంటూ ఉంటాం. మోసాలు చేసేవాళ్ళు, అబద్ధాలాడేవాళ్ళు, చాడీలు చెప్పేవాళ్ళు, లేనిపోని నిందలు వేసేవాళ్ళు, ఆ నిందలు పదిమందికీ అందేటట్టు మోసేవాళ్ళు, కాపురాలు తీసేవాళ్ళు, దొంగతనాలు చేసేవాళ్ళు - ఇలాంటి వాళ్ళంతా రోగ్స్‌అని మన ఉద్దేశం. హోమియో తత్త్వశాస్త్రాన్ని ద్రష్టలైన పెద్దల దగ్గర ఉపదేశం పొందినవారికీ, శ్రద్ధతో అధ్యయనం చేసినవారికీ తెలుస్తుంది- వాళ్ళంతా రోగ్‌లు కాదు, రోగులేనని. వ్యాధి పీడితులుతప్ప, దుఃఖించడానికీ, దుఃఖింపచేయడానికి ఎవరూ సిద్ధపడరని ఆశాస్త్రం ఉదాహరణ పూర్వకంగా వివరిస్తుంది. అప్పుడు దుర్బలులుగా దుర్మార్గులుగా ప్రవర్తిస్తున్నవారిని చూచి, మనకు జాలి వేస్తుందితప్ప, ద్వేషం

కలగదు. మానవుడికి పరిపూర్ణమైన భూతదయ అబ్బడానికి హోమియో తత్త్వశాస్త్రం ఒక మంచి స్నేహితునిలా సహాకరిస్తుంది. సద్గురువులా దివ్యదర్శనాన్ని అనుగ్రహిస్తుంది" అన్నారొకసారి కృష్ణస్వామి సదవగాహనకు హోమియో శాస్త్రమిచ్చే చేయూతను వివరిస్తూ.

అందుకున్నాను - అందుకు ఉన్నాను

కోడూరులో వైద్యసేవలో ఉన్నారు కృష్ణస్వామి.

ఒక తల్లి తన 14 ఏళ్ళకుర్రాణ్ణి తీసుకుని క్యూ ప్రకారం కృష్ణస్వామిని చేరి, బిడ్డనుగూర్చి చెప్పి, అతని అలవాట్లు అభ్యాసాలనుగూర్చి వివరించి, "ఒక్కగానొక్క కొడుకు-వీణ్ణి మీరే అన్నివిధాలుగా తీర్చిదిద్దాలి. మీచేతుల్లో పెడుతున్నాను" అంటూ కుర్రవాడి చేతుల్ని కృష్ణస్వామి చేతులకందించింది. ఆ చేతుల్ని అందుకుంటూ కృష్ణస్వామి, "అందుకున్నాను. అందుకు ఉన్నాను" అంటూ ప్రేమ కురుస్తున్న కన్నులతో ఆమెవైపు చూశారు.

ఆయన వాక్యంలోని భావం ఎంత లోతైనదో అంత విశ్వాసం ఆమెకు కలిగి, "అందుకేగా స్వామీ, పనిగట్టుకుని పట్టుకొచ్చాను" అన్నది నమస్కరిస్తూ.

కృష్ణస్వామి ఆమెవైపు ఓదార్పుగా చూశారు.

"బరువంతా దిగిపోయి, ఒళ్ళే తేలికైపోయినట్టుంది, మీనోటినుండి ఆ మాట వినేటప్పటికి" అంటూ పరవశించిందామె.

సమాజము-సంస్కరణ

నాన్న బ్రహ్మన్ అయినప్పుడు
నాన్-బ్రాహ్మిన్ ఎక్కడ ?

"ఆఫీసుల్లోనూ, యూనివర్శిటీల్లోనూ ఎక్కడ చూసినా కులతత్త్వం. అంతటా బ్రాహ్మిన్, నాన్-బ్రాహ్మిన్ ఫీలింగే" అన్నాడొక మిత్రుడు ఇష్టాగోష్ఠి జరుపుతూ కృష్ణస్వామి గారితో.

కృష్ణస్వామి చిరునవ్వు నవ్వుతూ "నాన్న బ్రహ్మన్ అయినప్పుడు నాన్‌బ్రాహ్మిన్ ఎక్కడున్నాడు? అందర్నీ సృష్టించింది ఒకే బ్రహ్మకదా, అయినప్పుడు అందరూ సోదరులే కదా! నాన్‌బ్రాహ్మిన్ వేరే ఉన్నాడని అనుకుంటే, అతణ్ణి సృష్టించడానికి మరొక నాన్‌బ్రహ్మ కూడా ఉండవలసి వస్తుంది. సృష్టి తత్త్వం తెలిసికూడా ఈ దృష్టిలో పంరావడం విచిత్రం కదూ" అన్నారు.

మిత్రుడు "మీ చమత్కార సంభాషణ మూలాలనే కుదిపేస్తోంది సుమా" అన్నాడు, ఆశ్చర్యం పొందుతూ.

సమాజము-సంస్కరణ

నాన్న బ్రహ్మన్ అయినప్పుడు నాన్-బ్రాహ్మిన్ ఎక్కడ ?

"ఆఫీసుల్లోనూ, యూనివర్శిటీల్లోనూ ఎక్కడ చూసినా కులతత్త్వం. అంతటా బ్రాహ్మిన్, నాన్-బ్రాహ్మిన్ ఫీలింగే" అన్నాడొక మిత్రుడు ఇష్టాగోష్ఠి జరుపుతూ కృష్ణస్వామి గారితో.

కృష్ణస్వామి చిరునవ్వు నవ్వుతూ "నాన్న బ్రహ్మన్ అయినప్పుడు నాన్‌బ్రాహ్మిన్ ఎక్కడున్నాడు ? అందర్నీ సృష్టించింది ఒకే బ్రహ్మకదా, అయినప్పుడు అందరూ సోదరులే కదా! నాన్‌బ్రాహ్మిన్ వేరే ఉన్నాడని అనుకుంటే, అతణ్ణి సృష్టించడానికి మరొక నాన్‌బ్రహ్మకూడా ఉండవలసి వస్తుంది. సృష్టి తత్త్వం తెలిసికూడా ఈ దృష్టిలోపంరావడం విచిత్రం కదూ" అన్నారు.

మిత్రుడు "మీ చమత్కార సంభాషణ మూలాలనే కుదిపేస్తోంది సుమా" అన్నాడు, ఆశ్చర్యం పొందుతూ.

"సత్యాన్ని వంటపట్టించడానికి సరసం చాలు; విరసం అక్కర్లేదు" అన్నారు, కృష్ణస్వామి మరొక చెణుకు విసురుతూ.

పాలిటిక్స్ - పాడుట్రిక్స్

ఒక విద్యార్థి మందుకనివచ్చి, కాస్సేపు కృష్ణస్వామి గారితో మాట్లాడివెళదామని ఆయనకు ఖాళీఅయ్యేదాకా ఉన్నాడు. ఆపైన తనను గూర్చిన తికమక లేవో చెప్పుకుంటూ "ఏంవిటోనండి, ఎక్కడ చూసినా పాలిటిక్సే" అన్నాడు.

"పాలిటిక్స్ కావయ్యా అవి పాడుట్రిక్స్" అన్నారు నవ్వుతూ కృష్ణస్వామి.

ఆ విద్యార్థి ఆశ్చర్యపడుతూ నవ్వాడు.

కృష్ణస్వామి ఇలా అన్నారు -

"ప్రతి పిచ్చివేషాన్ని, ప్రతి దుష్ట ఆలోచనని, స్వార్థం కోసం పడే ప్రతి కక్కుర్తిని పాలిటిక్స్ అంటే ఎలా ? ఆపదం చౌకబారయిపోదూ ? రాజ్యక్షేమం కోసం వేసే ఎత్తుగడలు రాజకీయాలవుతాయి. స్వార్థం కోసం పడే కక్కుర్తుల్ని రాజకీయాలనవచ్చా ? అందుకే నేనీ వెధవవేషాలన్నిటినీ పాలిటిక్స్ అనకుండా పాడుట్రిక్స్ అంటున్నాను. నామకరణం బాగుంది కదూ !"

"చాలా బాగుంది. పరిస్థితులకు తగ్గట్టుగా ఉంది" అన్నాడతను.

అవును, చదువు'కొంటు'న్నారు

ఒకసారి ఒకాయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ "ఇక్కడ ఈ పిల్లలు చదువుకుంటున్నారు. అక్కడ ఆ పిల్లలు చదువుకుంటున్నారు" అంటూ తమ పిల్లల్ని గూర్చిన భోగట్టాలు చెప్పసాగాడు.

మధ్యలో కృష్ణస్వామి చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నారు - "అవును, మన పిల్లలు చదువు 'కొంటు'న్నారు."

కృష్ణస్వామిగారి విరుపు ఆయనకు అర్థమై నిజమే నన్నట్టు నవ్వేశాడు.

పిల్లలకుగాను ఇక్కడ ఇంత ఖర్చవుతోంది, అక్కడ అంత ఖర్చవుతోంది అన్న విషయాలను ఏకరువు పెడుతున్న వాడు ఆవిరుపుని అర్థంచేసుకోలేడూ ? అది విరుపుకాదు; మన సమాజం వీపుపైన కృష్ణస్వామి చరుస్తున్న ఒక చరుపు.

డబ్బులు ఖర్చవుతున్నాయి, పట్టాలొచ్చేస్తున్నాయి తప్ప, మనపిల్లలకు జరుగుతున్న దేమిటి? మనకు ఒరుగుతున్న దేమిటి ?

వృత్తి విద్యలు - ఉత్త విద్యలు

పూర్వం మనం ఆశ్రయించినవి వృత్తివిద్యలు. ఇప్పుడు మనం ఆశ్రయించడానికి మోజు పడుతున్నవి ఉత్తవిద్యలు. వృత్తివిద్యలవల్ల, సమాజానికి ఉపయోగపడి, మన అన్నం

మనం సునాయాసంగా పొందేవాళ్ళం. వాటిని విడిచిపెట్టి ఈవృత్తివిద్యలవెంటపడినతర్వాత, ఎంత చదివినా ఉద్యోగం కోసం ముష్టెత్తక తప్పదు కదా! అన్ని ఘారాలు చదివి ఏమి చేయాలో తెలియక ఏ కోళ్ళఫారాలో పెట్టుకున్న వాళ్ళెంత మందిలేరు ? ఈ కోళ్ళఫారాలు డైరీఫారాలు పెట్టుకోవడానికి చదువుపేరిట ఇన్నివేలు తగలబెట్టడ మెందుకు ? చిన్నప్పటి నుంచి మనపెద్దవాళ్ళ దగ్గర శిక్షణ పొంది ఉంటే, ఇంతకన్న చక్కగా వాటిని నిర్వహించగలం కదా ! చదువుకున్నతర్వాత వాటి దగ్గరకు వచ్చామని తెలిస్తే, ఆ కోళ్ళు, గేదెలు మనను ఒక ఆట ఆడించేస్తాయి సుమా! పనినివిడిచి చదువుకున్నవాడు తిరిగి పనిని ఎలాచేయగలడు ? పనిని విడువక చదువుకున్న వాడు, తాను చేయగలిగిన పనినిగూర్చి చదువుకున్నవాడు మనకిపుడు కావాలి" అంటూ వివరించారు ప్రస్తుత విద్యా విధానంలోని అవకతవకలను సమీక్షిస్తూ కృష్ణస్వామి ఒకసారి

వెనుకబడిన జాతులు కారు — వెన్నెముక జాతులు మీరు

1981 ఆగష్టు 15న స్నేహపూర్వకమైన ఆహ్వానాన్ని పురస్కరించుకుని, ఒక బి. సి. హాస్టల్‌లోని విద్యార్థుల్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ, కృష్ణస్వామి-

"మీవి వెనుకబడిన కులాలని అన్నవారెవరు ? వెనుక బడిన కులాలుకాదు - వెన్నెముకవంటికులాలు మీవు.

Backward casts కాదు - Backbone casts. బాక్‌వర్డ్ అన్న మాటే ఆక్‌వర్డ్‌గా ఉంది. మనం ఏది భావిస్తే అదయిపోతాం. 'నేను పనికిరానివాణ్ణి, నేను పనికిరానివాణ్ణి' అని పదేపదే అనుకుంటే నేను నిజంగానే పనికిరానివాణ్ణాయిపోతాను. అలాంటిదే నేను వెనుకబడినవాణ్ణి అనుకోవడం కూడా. నిజానికి మీ కులాలవాళ్ళు చేస్తూ వస్తున్న కాయకష్టం మీదనే ఈ దేశం ఇప్పటివరకూ నిలబడి ఉంది. మిగతావాళ్ళంతా మీ కాయకష్టాన్ని అమ్ముకునో కొనుక్కునో బ్రతుకుతున్నవాళ్ళే. అయితే, ఒక ప్రమాదం వచ్చింది - చదువుకుని పని చేయలేనివాళ్ళూ, పనిచేయడానికి ప్రాణం ఒప్పనివాళ్ళూ దళారీలుగామారి, ఈ పనిచేస్తున్న వాళ్ళను మోసం చేయడం ప్రారంభించారు. వాళ్ళ మోసంలో పడకుండా ఉండాలి అంటే మీరు చదువుకోవాలి. మీకు అక్షరం ముక్కలు రావాలి. లోకరీతులు తెలియాలి.

"కానీ, మీరు మరో విధంగా మోసపోయే ప్రమాదం ఉంది. ఈ చదువుకోవడంలో పడి, మీరు చేస్తున్న పనిని మానివేయడమో, లేక దాన్ని హీనంగా చూడడమో చేయకూడదు. అదే జరిగితే, మీరుకూడా మాలాంటి చదువుకున్న వారిలాగ కర్మభ్రష్టులవుతారు. చేతిలో ఉన్న పనిని వదలుకొని, ఇంకెవరో ఇచ్చే పనికోసం చేయి జాచే దుస్థితికి దిగజారకండి. మీ వృత్తివిద్యలు మీరు నేర్చుకుంటూనే ఈ చదువులు మీరు **చదువుకోండి.** లేకపోతే లేని గోడకు

సున్నం కొట్టినట్టవుతుంది మీ పని” అంటూ కృష్ణస్వామి చేసిన విశ్లేషణ ఆ కుర్రవాళ్ళకు బాగా హత్తుకుంది. తమను గూర్చి తమకు తెలియజెప్పినందుకు వారెంతో సంతోషించారు. తెలియనివి చెప్పేవారు చాలామంది ఉంటారు. కానీ, తెలియజెప్పగలవారు కొందరే ఉంటారు.

అవకాశంతోపాటు అర్హతను కూడా పెంచగలగాలి

“వెనుకబడినవారిని పైకి లేవనెత్తడానికి కోట్లు కోట్లు ఖర్చుపెడుతోంది ప్రభుత్వం. కానీ అభివృద్ధి కాగితాలమీద కనిపించినంతగా జీవితాలలో కనిపించడంలేదు. దీనికి కారణ మేమిటంటారు?” అని అడిగారు సన్నిహితు లొకరు కృష్ణ స్వామిని.

కృష్ణస్వామి ఇలా అన్నారు - “కోట్లు కోట్లు ఖర్చుపెట్టి ప్రభుత్వం ఏం చేస్తోంది? బాగుపడడానికి అవకాశాలు కల్పిస్తోంది. కానీ వ్యక్తి బాగుపడడానికి అవకాశం ఒక్కటే చాలదు. అతనికి అర్హతకూడా పెరగాలి. అంటే ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగల సంస్కారం అతనిలో పెంపొందాలి. తగిన సంస్కారం లేనప్పుడు అవకాశాలు లభించడం చిల్లుకుండకు నీళ్ళుపోసేవాడు దొరకడం లాంటిది. అవకాశాలు కల్గించే ప్రయత్నంతోబాటు, అర్హతను పెంచే ప్రయత్నం కూడా ఏకకాలంలో జరిగినప్పుడు మాత్రమే ప్రయత్నాలు ఫలించగలవు. కానీ నాయకుల దృష్టి

అవకాశాలు కల్పించి వారి నుండి ఓట్లు పొందడంపైన ఉంటోంది తప్ప, వారెంతవరకు తామిచ్చిన అవకాశాలు సద్వినియోగ పరచుకుంటున్నారన్న అంశం మీద ఉండడం లేదు. ఈ దృష్టిలోపం చాలా దారుణ ఫలితాలకు దారి తీయగలదు. అసలు మార్గమేమిటంటే ముందు నాయకుల అర్హతలు పెరగాలి-'యథారాజా, తథాప్రజా' కదా మరి!"

"మీ వివరణ చక్కటి సత్యదర్శనాన్ని కల్గిస్తోంది. మీ మాటలు అక్షరాలా నిజం" అంటూ తృప్తి చెందాడు ఆ అడిగిన వ్యక్తి.

నినాదం చాలదు—నిర్మాణం కావాలి

"నవసమాజం కావాలి, సమసమాజం కావాలి, శాస్త్రీయ విద్యావిధానం రావాలి మొదలైన నినాదాలు గోడలపైన కనబడుతూ ఉంటాయి. ఊరేగింపుల్లో వినబడుతూ ఉంటాయి. ఈ నినాదాలు మంచివే. అవన్నీ కావలసిందే. రావలసిందే. కాని,రప్పించేవారెవరు అన్నది ప్రశ్న. ఆ ప్రశ్నను సూటిగా వేసుకుంటే రప్పించవలసిందీ, రూపొందించవలసిందీ మనమేగాని ఆ గోడలు కాదనీ కాబట్టి వాటిపై వ్రాసి లాభం లేదనీ జవాబు వస్తుంది. రావాలని గొంతెత్తి అరుస్తున్న మనం గోడలు పాడుచేస్తున్న మనం అవి రావడానికిగాను చేస్తున్న కృషి ఏమిటని మనని మనం ప్రశ్నించుకోవలసి ఉంటుంది.

"వీటిని తీసుకురావలసిన బాధ్యత ప్రజలు పాలకులమీద, పాలకులు ప్రజలు, ప్రజల్లోని మేధావులమీద తోసేస్తూ కాలక్షేపం చేస్తున్నారు. కాని నవసమాజ నిర్మాణంలో మనలో ప్రతిఒక్కరికీ పాత్ర ఉంటుందని గ్రహించి తనవంతు పాత్రనెరిగి నిర్వహించగలవాడే నిజమైన పౌరుడు. మనం అలాంటి పౌరసత్వానికి నోచుకోవలసి ఉంటుంది. హక్కుల ఎడల ఆపేక్ష, బాధ్యతల ఎడల ఉపేక్ష మన జాతిలక్షణంగా కనబడుతోంది. ఈ లక్షణంనుండి మనం బైటపడాలి. నినాదం చాలదు; నిర్మాణం కావాలి. నిర్మాణాత్మకమైన కృషిలేని నినాదాలు గాలికి ఒత్తిడి,కంఠానికి రాపిడి తప్ప, ప్రయోజనాన్ని సాధించలేవు. ఈ సత్యాన్ని ఇప్పటికైనా మనం గ్రహించాలి. నేనుగాక ఇంకెవరో చేయలేదనే బాధలే నినాదాలు. నేనుచేస్తే మరి కొంతమంది చేస్తారని తెలియాలి" అన్నారొకసారి యువకుల్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ కృష్ణస్వామి.

తిట్టడంకాదు_తట్టడం కావాలి

"సమాజం కుళ్ళిపోయిందని దిగజారిపోతుందని ఇక బాగుపడదని శపించినట్టు తిట్టేవాళ్ళు తగులుతూ ఉంటారు. దానివల్ల తిట్టేవాళ్ళలో ద్వేషం, విన్నవాళ్ళకు నిస్పృహ పెరగడం తప్ప జరిగేదేమీ ఉండదు. చేయవలసింది తిట్టడం కాదు; తట్టడం.

"ప్రతి మనిషిలోనూ ఎంతో కొంత మంచి ఉంటుంది. ఆ మంచిని తట్టి లేపేవాళ్ళిపుడు కావాలి. మాటలతో

మాత్రమే దాన్ని తట్టగలమనుకోవడం మన అనుభవంలేని తనాన్ని తెలియజేస్తుంది. ప్రవర్తనతో మాత్రమే దాన్ని మనం కర్తవ్యోన్ముఖంగా తట్టగలం. అంటే మనుషులలోని మంచిని తట్టి, మనిషిని పెంచగల తోటమాలులవంటి మంచి వేత్తలు మనకిప్పుడు కావాలి.

"వక్తృత్వంతో మనుషులను ఆవేశపరచగలం. వ్యక్తిత్వంతో మాత్రమే మనుషులను ఆచరింప జేయగలం. నవ సమాజాన్ని కోరేవారు ఈ సత్యాన్ని గ్రహించగలగడం ఎంతైనా అవసరం. నవసమాజ నిర్మాణానికి కావలసింది ప్రవర్తనతో కూడిన ప్రబోధం. అప్పుడు ప్రబోధం మనిషిని మేల్కొలుపుతుంది, ప్రవర్తన మనిషిని తీర్చిదిద్దుతుంది. ప్రవర్తనలేని ప్రబోధం మనిషిని రెచ్చగొట్టకలదు తప్ప, తీర్చిదిద్దలేదు. ప్రబోధం లేకపోయినా ప్రవర్తనఉంటే, ఆ ప్రవర్తన రామకథలా జగత్తును ఆక్రమించగలదు. కాల కాలాల్లో మానవుల వెన్నుతట్టి, జీవితాలను తీర్చిదిద్దగలదు" అంటూ కృష్ణస్వామి ఒకప్పుడు చెప్పిన మాటలు మంత్రాలై నా చెవుల్లో ఇప్పటికీ మారుమ్రోగుతూనే ఉన్నాయి.

భుజకీర్తులు కలవారు కాదు _ భుజంకలిపేవారు ఇప్పుడు కావాలి

"మహత్తర విషయాలు తెలిసినవారు ఉండవచ్చు. మహాపండితులు ఉండవచ్చు. అఘటనఘటనా సమర్థులూ ఉండవచ్చు. కానీ మనకిప్పుడు కావలసింది భుజకీర్తులు కల వారు కాదు, భుజం కలిపి నడిచేవారు.

"పెద్దవాళ్ళు అనబడేవారిలో రెండురకాలవాళ్ళుంటారు. మిగిలిన సమాజం తమను గౌరవించాలి అని కోరుకునే వారొకరకం; సమాజాన్ని మనకున్న శక్తియుక్తులతో సేవించుకుందాం అని దీక్ష వహించి, సామాన్యులతో భుజం కలిపి నడిచేవారింకొకరకం. ఈ రెండురకాల్లో మొదటివారికి కావలసింది సన్మానం. రెండవవారు కోరేది సన్మార్గం. మొదటివారు ప్రజలు తమకొరకు ఉన్నారనుకొంటారు. రెండవవారు ప్రజలకొరకు తామున్నామని తెలుసుకుంటారు. మొదటిరకంవారికి ప్రజలు కానుకలు చెల్లించుకుంటారు. రెండవరకంవారికి ప్రజలు తమ జీవితాలనే సమర్పించుకుంటారు. పెద్దవాళ్ళల్లో రెండవరకంవారి సంఖ్యపైన ఆధారపడి ఉంటుంది సామాజిక పురోభివృద్ధి. అందుకే వారి సంఖ్య పెరగాలని కోరుకుంటున్నాను" అన్నారు కృష్ణస్వామి చక్కటి విశ్లేషణ నందిస్తూ ఒకసారి.

తిరుగుబాటు కాదు, తిరిగి బాటకెక్కించడం కావాలి

చరిత్ర గతిని శ్రద్ధతో పరిశీలిస్తే, కొన్ని శతాబ్దులలో మానవజాతి సుఖంగా సహజీవనం చేసినట్టు, ఇంకొన్ని శతాబ్దుల్లో భేదభావంతో మారణహోమాలు జరుపుకున్నట్టు తెలుస్తుంది. భౌతికంగా మానసికంగా సమస్థితిని అనుభవించడానికి సిద్ధపడినప్పుడు జాతి సుఖపడుతూ ఉంటుంది. సమస్థితికి సిద్ధపడనప్పుడు పోరాటాలతో దుఃఖపడుతూ ఉంటుంది.

"సహజీవనానికి దారితీసే బాట ఒకటి ఉన్నది. ఆ బాటనే అనాదిగా ద్రష్టలంతా దర్శిస్తూ వస్తున్నారు. ధర్మ సంస్థాపనమంటే మరల మరల మానవ జాతిని ఈ బాటకు చేరుస్తూ ఉండడమని అర్థం. శాశ్వతమైన ఈ బాటనే పెద్దలు సనాతన ధర్మము అని పిలిచారు. సనాతనమంటే ప్రాచీనమని అర్థంకాదు; శాశ్వతము, నిత్యనూతనము అని అర్థం. మనిషికీ మనిషికీ సంబంధం ఎలా ఉండాలి అన్నది, ఎలా ఉంటే సుఖపడతారు అన్నది దేశకాలాలకు అతీతంగా ఒకే విధంగా ఉంటుంది. ఇప్పుడు మనకు తిరుగుబాటు తెచ్చే వారు కాదు, తిరిగి బాటకెక్కించేవారు కావాలి. క్రొత్తదాన్నే సాధించాలనుకోవడం కట్టుతనాన్ని తెలియజేస్తుంది. కావలసినదాన్ని సాధించుకోవాలనుకోవడం వివేకాన్ని సూచిస్తుంది.

"కావలసినదానిపైన దృష్టి ఉన్నవాడికి పాతక్రొత్తలంటవు. పాతక్రొత్తలంటనివాడే దేశకాలాలకు అతీతంగా ఉన్న సహజీవనమార్గాన్ని తన దేశకాలాలకు అనుగుణంగా సమన్వయించి, అందించగలుగుతాడు. సమన్వయించినప్పుడల్లా అది క్రొత్తగా కనపడుతూ ఉంటుంది. కానీ, సమన్వయించినవాడికి తెలుసు అది - సనాతనమైనదని, నిత్యనూతనమైనదని" అంటూ కృష్ణస్వామి లోతులకు తీసుకువెళ్ళి లోటులు దిద్దుకునే మార్గం చూపారు ఒక ప్రసంగంలో.

సహచరులు-సరిదారి

మందడుగు — ముందడుగు

"మాస్టరుగారు మా ఇలువేల్పు. మా చిన్నబ్బాయి జబ్బుతో మాకు మాస్టరుగారి నీడ దొరికింది. ఆ తరువాత మీ గూర్చి మీ ర[శ్రద్ధ చేయద్దు అని మా ఆవిడ పదేపదే చెప్పడంతో నేను కూడా వారిదగ్గర మందు మొదలుపెట్టాను. ఈమధ్య మా మరదలు వచ్చింది. ఆవిడ అనారోగ్యాన్ని గురించి కూడా మాస్టరుగారినే సంప్రదించాం. ఈ మధ్యనే తమకు కూడా మాస్టరుగారి మందే కావాలని, వినికిడివల్ల విశ్వాసం పెరుగుతోందని మా నాన్నగారు ఉత్తరం వ్రాశారు. ఈ విధంగా మేమూ, మా కుటుంబం, మా వంశం, బంధుమిత్రులు - అందరం మాస్టరుగారి మార్గంలోకి చేరుకున్నాం. ఆ బాటనే నడుస్తున్నాం."

తమకు సన్నిహితుడైన ఆ వ్యక్తి మాటలు విని, కృష్ణస్వామి చిన్నగా నవ్వారు.

'ఏమి అలా నవ్వుతున్నారు?' అని అడిగాడు ఆయన.

సహచరులు-సరిదారి

మందడుగు — ముందడుగు

"మాస్టరుగారు మా ఇలువేల్పు. మా చిన్నబ్బాయి జబ్బుతో మాకు మాస్టరుగారి నీడ దొరికింది. ఆ తరువాత మీగూర్చి మీ రశ్రద్ధ చేయద్దు అని మా ఆవిడ పదేపదే చెప్పడంతో నేను కూడా వారిదగ్గర మందు మొదలుపెట్టాను. ఈమధ్య మా మరదలు వచ్చింది. ఆవిడ అనారోగ్యాన్ని గురించి కూడా మాస్టరుగారినే సంప్రదించాం. ఈ మధ్యనే తమకు కూడా మాస్టరుగారి మందే కావాలని, వినికిడివల్ల విశ్వాసం పెరుగుతోందని మా నాన్నగారు ఉత్తరం వ్రాశారు. ఈ విధంగా మేమూ, మా కుటుంబం, మా వంశం, బంధుమిత్రులు - అందరం మాస్టరుగారి మార్గంలోకి చేరుకున్నాం. ఆ బాటనే నడుస్తున్నాం."

తమకు సన్నిహితుడైన ఆ వ్యక్తి మాటలు విని, కృష్ణస్వామి చిన్నగా నవ్వారు.

'ఏమి అలా నవ్వుతున్నారు?' అని అడిగాడు ఆయన.

"మీరు 'మాస్టరుగారి మార్గానికి చేరుకున్నాం, నడుస్తున్నాం' అన్నారు కదా, అందుకు నవ్వొచ్చింది."

తానన్నదానిలో తప్పేమిటా అన్నట్టు చూశాడాయన.

కృష్ణస్వామి ఇలా వివరించారు -

"మీరు చెప్పిన సన్నివేశాల్లో మీరు మాస్టరుగారిని ఉపయోగించుకుంటున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. అంతో పం-తప్పులేదు, మనకు ఉపయోగపడడానికే ఆయన ఉన్నారు కనుక. కానీ ఆయన మార్గంలో నడుస్తున్నాం అన్నారు మీరు. నడిస్తే అంతకన్న కావలసింది లేదు. ఆయనలా పదిమందికి ఉపయోగపడగలిగినప్పుడు మాత్రమే ఆయన మార్గలో మనం నడుస్తున్నట్టు అవుతుంది. అంతవరకు వారిని ఉపయోగించుకుంటున్నాం అని మాత్రం చెప్పవచ్చు. ఉపయోగం పొందే స్థితినుండి ఉపదేశంపొందేస్థితికీ, మందు అడిగే స్థితినుండి ముందడుగువేసే స్థితికీ మనం ఎదగాలి. అలా ఎదిగినప్పుడుమాత్రమే ఆయన మార్గం మనకు చేరువౌతుంది."

ఆ వ్యక్తి కొంచెం సిగ్గుపడుతూ "మీరన్నది నిజమే. మీరన్నట్టు ఆయననుండి ఉపయోగం పొందేస్థితినుండి ఆయనలా ఉపయోగపడే స్థితికి ఎదగాలనీ, ఆయన మార్గాన నడిచే మంచిరోజులు రావాలనీ కోరుకుంటున్నాను" అన్నాడు.

"వచ్చాయి కాబట్టే కృష్ణస్వామిగారినుండి ఈ హెచ్చరిక మీకు అంది ఉంటుంది" అన్నాను నేను.

నమ్ముతుంటున్నామా? అమ్ముకుంటున్నామా?

మాస్టరుగారి ఆశీస్సులతో ఒక వ్యాపారసంస్థను పెట్టి దినదిన ప్రవర్ధమానంగా నడుపుతున్న వ్యక్తి ఒకరు ఒకసారి కృష్ణస్వామిని కలిసి ఇలా అన్నారు -

"మాస్టరుగారి దయవల్ల మా వ్యాపారం నిరాఘాటంగా సాగుతోంది. ఎక్కడకు వెళ్ళినా ప్రతి సంస్థలోనూ, మాస్టరుగారి శిష్యులు, అభిమానులు ఉంటారుకదా! వాళ్ళందరూ ప్రేమతో సహకరిస్తున్నారు. మా ఖాతాదారుల్లో కూడా ఎక్కువమంది మాస్టరుగారిని బాగా తెలిసున్నవారే. ఆ అభిమానంతోనే మా సంస్థకు అలవాటు పడ్డారు. ఆయన దయవల్ల చీకూచింతా లేకుండా బండి నడిచిపోతోంది."

కొంచెం ఆగి, కృష్ణస్వామి ఇలా అడిగారు- "పూర్వం మీరు డిస్పెన్సరీలో సేవచేస్తూ కనపడేవారు. ఈమధ్య ....?"

అతనందుకొని ఇలా అన్నాడు - "సాగటంలేదండీ. వ్యాపారం పని సరిపోతోంది".

"సాయంకాలం ఉపన్యాస సమయంలో కూడా...?"

"కుదరడంలేదండీ. అప్పటికీ ఎంతో ప్రయత్నిస్తున్నాను."

కృష్ణస్వామి ఇలా అన్నారు-

"నాకు అప్పుడప్పుడు ఒక అనుమానం వస్తూ ఉంటుంది. మాస్టరుగారిని మనం నమ్ముకుంటున్నామా, లేక అమ్ముకుంటున్నామా అని. ఆయన పేరును ఉపయోగించుకోవడంలో ఉన్న కుతూహలం ఆయన చూపిస్తున్న మార్గాన నడవడంలో కనపడనప్పుడల్లా నాకీ సందేహం వస్తూ ఉంటుంది."

అవతలి వ్యక్తి కొంచెంగా తలవంచుకున్నాడు. కృష్ణస్వామి ఇంకా ఇలా అన్నారు-

"మాస్టరుగారిని ఉపయోగించుకోవడం తప్పు కాదు. కానీ మాస్టరుగారిలా మనం నలుగురికి ఉపయోగపడడం జరుగుతున్నప్పుడు మాత్రమే ఆ ఉపయోగాన్ని స్వీకరించడానికి అర్హుల మౌతాము. లేనప్పుడు మనం అవకాశవాదులమే."

ఆలోచనలో పడినట్టయి అతని కన్నులు కొద్దిగా చెమర్చాయి. కొంచెం గద్గదమైన కంఠంతో ఇలా అన్నాడు- "నిజమే, మీరన్నది. వెనక్కి తిరిగి చూసుకుంటే, నేను అవకాశవాదినేమో అనిపిస్తోంది. దారిదొరికేటంతవరకు సేవలో పాల్గొన్నాను. ఉపన్యాసాలకు శ్రద్ధగా వచ్చాను. కానీ చిత్రం! ఆయన దయవల్ల దారి దొరికింది. ఈ సంస్థ పెట్టాను. బండి నడుస్తోంది. నాకు తెలియకుండా నేను

మాస్టరుగారికి దూరమయ్యానని ఇప్పుడు మీ మాటలవల్ల బోధపడింది. అవసరం తీరేటప్పటికి మనిషి మనస్సు ఎందుకిలా చిత్రంగా ప్రవర్తిస్తుందో!" అతని కళ్ళనుండి నీళ్ళు జలజలా రాలాయి.

కృష్ణస్వామి "కలత పడకండి. కర్తవ్యాన్ని గమనించండి. మిమ్మల్ని కర్తవ్యోన్ముఖుల్ని చేసేటందుకే పని కట్టుకుని హెచ్చరించాను. మీకు తెలియకుండానే జారిపోతున్నారు గనుక, సహచరుడిగా తెలియజెప్పాను. మనకి మనం చెప్పుకోకపోతే ఇంకెవరు చెపుతారు? నాకు మీరు చెప్పాలి, మీకు నేను చెప్పాలి. ఒకరి నొకరు హెచ్చరించుకొంటూ మాస్టరుగారితో కలిసి నడవాలి" అనే వాక్యాలతో కన్నీళ్ళు తుడిచారు.

"వస్తాను సార్. రేపట్నుంచి ఇదివరకు లాగానే ప్రవర్తిస్తాను. మీరే చూస్తారుగా" అంటూ సెలవు కోరాడు.

కృష్ణస్వామి ఇలా అన్నారు-

"మీరు చేస్తున్న పనిని మానుకుని సేవలో పాలొనకండి. పనిని సద్దుబాటు చేసుకునేటందుకు వీలయితేనే చూడండి. లేనప్పుడు మీరు చేస్తున్న పనినే మాస్టరుగారి వెలుగులో చేయండి. ఆయన వెలుగును విడవకుండా ఉండడమే మనకు ముఖ్యం."

"పరవా లేదులెండి. వచ్చేస్తాను. మాస్టరుగారి సేవలో ఎంతో కొంతసేపు పాలుపంచుకుంటేనే మీరన్నట్టు మిగిలిన

వృత్తివ్యాపారాలు ఆయన వెలుగులో నిర్వహించడానికి పిలవుతుంది అని నాకనిపిస్తోంది. లేకపోతే ఇప్పుడు వచ్చినట్టే ఏమరుపాటు వచ్చేయగలదు. వస్తాను" అంటూ తృప్తిగా సెలవు తీసుకున్నాడు.

జీతంకన్న జీవితం విలువైనది

ఒకసారి ఒక నడివయస్సువాడు తనకు బంధువైన ఒక యువకునితో కృష్ణస్వామిగారిని కలిశాడు. మాటల సందర్భంలో "మావాడు మిమ్మల్ని ఎప్పట్నుంచో ఒకప్రశ్న అడుగుదా మనుకుంటున్నాడు. 'అడగవచ్చు. ఆయనేమీ అనుకోరు. ర' మ్మని నాతో తీసుకువచ్చాను. ఆ ప్రశ్నకు మీరు చెప్పబోయే సమాధానం విందామని నాకూ ఉంది" అన్నాడతను.

"సంకోచం ? ఎందుకు మనమధ్య ఉండవలసింది చనవుగాని, సంకోచం కాదు" అన్నారు కృష్ణస్వామి, ఆ యువకుని చూస్తూ.

"ఏమీ లేదు. మీరు ఉద్యోగం చేయకుండ మాస్టరుగారితోనే ఉండిపోవాలని ఎందుకు నిర్ణయించుకున్నారు ? అన్నదే నా ప్రశ్న."

కృష్ణస్వామి నవ్వుతూ, "మనిషి అన్నవాడు తనకు తగిన పనిని చేయాలని నా ఉద్దేశం. దీనినే మన పెద్దవాళ్ళు స్వధర్మ నిర్వహణం అన్నారు. మనంచేసే పనివల్ల మనం

పెరగాలి. అన్ని విధాలా పెరగాలి. పూర్వం వృత్తివిద్యల నాశ్రయించినప్పుడు ఈ పెరుగుదల సిద్ధించేది. బుద్ధిమంతుడైన ఒక వడ్రంగి ఉన్నాడనుకో. అతను సమాజానికి కావలసిన పని చేసిపెడుతున్నాడు, కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వృత్తిని కళగా అభ్యసిస్తూ తాను పెరుగుతూ ఆత్మతృప్తిని అనుభవిస్తున్నాడు.

"ఆధునికమయిన విద్యావిధానంవల్ల మనిషి ఉద్యోగై కేవలం పొట్టపోసుకో గలుగుతున్నాడు. పొట్టపోసుకోవడమే గమ్యంగా పెట్టుకున్న యువకుడు తన స్వభావానికి తగని ఉద్యోగంలో కూడా కోరి ఇరుక్కుంటున్నాడు. దొరికిన కోర్సులో చేరడం, దొరికిన ఉద్యోగం చేయడం. అంతేగా మనం చేస్తున్నది! అందుకే మన జీవితాల్లో ఆత్మతృప్తికి బదులు అసంతృప్తి కలుగుతోంది. ప్రశాంతికి బదులు అశాంతి పండుతోంది. ఈ సత్యాన్ని గమనించిన నేను నన్ను నేను పెంచుకోదలచుకున్నాను. నేను చేసేపనిలో ప్రతి అంశం నా పెరుగుదలకు పనికిరావాలి, ప్రతిక్షణం నేను ఆత్మతృప్తిని అనుభవించగలగాలి. అందుకే దుర్లభమైన మాస్టరుగారి సన్నిధిలో ఈ జీవితాన్ని సమర్పణ చేశాను. చేశాను అనడం కన్న జరిగింది అనడం ఎక్కువ భావ్యం. ఇనుపముక్క అయస్కాంతానికి నేను అతుక్కున్నాను అనవచ్చా? అయస్కాంతంచేత ఆకర్షింపబడ్డాను అనవచ్చు. నాకు జీతంకన్న, జీవితం విలువైనది" అన్నారు.

యువకుడు విస్తుపోయి వింటున్నాడు. బహుశా తానెక్కవలసిన మెట్లవైపు చూస్తున్నాడేమో !

కారులేనివాడికి పెట్రోలు ఎందుకు ?

ఒకసారి ఒక యువకుడు కృష్ణస్వామిగారిని కలిసి "మా ఊళ్ళో మీ ఉపన్యాసం జరగాలని ఎప్పట్నుండో అనుకుంటున్నాం. మీరు తప్పకుండా రావాలి" అన్నాడు.

కృష్ణస్వామి చిన్నగా నవ్వుతూ "కారులేనివాళ్ళకు పెట్రోలు ఎందుకయ్యా ?" అన్నారు.

ఆ యువకుడు ఆశ్చర్యంగానూ, అర్థంకావలసింది ఉందన్నట్టుగానూ చూశాడు.

కృష్ణస్వామి ఇలా అన్నారు -

"నలుగురికీ పనికొచ్చే మంచిపని ఏదైనా చేస్తున్న వాళ్ళకు, చేయడానికి సిద్ధపడుతున్నవాళ్ళకు మా బోటి వాళ్ళ మాటలు పనికివస్తాయి. కాలక్షేపంకోసం వినే వాళ్ళకు, చెప్పేవాళ్ళ పాండిత్యాన్ని కొలవడానికి కూర్చునే వాళ్ళకు ఈ మాటలు అనవసరం. మంచిపని అనే వాహనానికి దిగి వస్తున్న సందేశాన్ని పెట్రోలుగా వాడుతున్న వాళ్ళం మేం. వాహనం లేకుండా పెట్రోలు నాహ్వానించడం అనవసరం కదా!"

ఆ మాటల గాంభీర్యానికి ఆ యువకుడు స్పందించాడు. "బోధపడింది మాస్టారూ! జరిగిన ఆలస్యానికి సిగ్గుపడుతున్నాను. త్వరలోనే వాహనాన్ని సిద్ధంచేసుకుని మిమ్మల్ని కలుసుకుంటాను"అని నమస్కరించాడు.

"నీ వలా సిద్ధపరచుకు రాగలవాడవని తెలిసేనయ్యా హెచ్చరించింది. మీరు నివురుగప్పిన నిప్పులు. మీ సామర్థ్యం అనే నిప్పుపైన అలసత్వం అనే నివురు కప్పుకొని ఉంది. ఆ నివురును ఊది అగ్నిని జ్వలింపచేయడానికే మా ప్రయత్నం. వెళ్ళి రా, శుభం."

సత్కర్మాచరణకు సద్గోష్ఠి పెట్రోలు

ఒకసారి ఒకానొక కేంద్రంనుండి ఒక సోదరుడు వచ్చి' కృష్ణస్వామిగారితో సమాలోచనం జరుపుతున్నాడు. డిస్పెన్సరీ నిర్వహణ మొదలైనవాటినిగూర్చి విని "సద్గోష్ఠు లేమైనా జరుపుకుంటున్నారా ?" అని అడిగాడు కృష్ణస్వామి.

"లేదండీ" అన్నాడతను.

"వారానికి ఒకరోజైనా నలుగురూ చేరి, ఏదో ఒక సద్గ్రంథాన్ని అధ్యయనం చేసి, వివరించుకోకపోతే మనకు తెలియకుండానే మనకు తుప్పుపడుతుంది సుమా! సత్కర్మాచరణ చిరకాలం కొనసాగాలి అంటే సద్గోష్ఠిని పెట్రోలుగా ఆ వాహనానికి పోసితీరాలి. లేకపోయినట్టయితే ఎంత మంచి ఉద్దేశంతో మనం ఒకచోట ఒక మంచిపని

చేయడానికి జేరినా క్రమంగా అభిప్రాయ భేదాలు పుట్టుకొచ్చి కుళ్ళిపోతాం. తోడివారితో దేవుడికి బదులుగా మనం దెప్పిపొడవడానికి పనికొచ్చే వ్యక్తి కనబడతాడు. సమర్పణా బుద్ధితో సద్గోష్ఠిలో క్రమశిక్షణతో పాల్గొంటున్నప్పుడు మాత్రమే తోడివారిని మనకన్నా ఇతరంగా చూసే నరకం నుండి మనం బయటపడతాం. అందుకే మన పెద్దలు స్వాధ్యాయ ప్రవచనాల ఎడల ఏమరుపాటు చెందవద్దని హెచ్చరించారు" అని అనేటప్పటికి "మీరన్న మాటలు అక్షరాలా అనుభవంలో కనబడుతున్నాయి. కారణం తెలియక తికమకపడిపోతున్న నాకు కర్తవ్యం బోధించారు. కానీ నిర్వహణకే సరైన వ్యక్తి ఎవరా? అని ఆలోచిస్తున్నాను" అన్నాడతను.

"ఏం నీవు తగవా?" అన్నారు కృష్ణస్వామి.

"నేనా?" అన్నాడతను సిగ్గుపడుతూ.

"పదాలు పలకడం కూడా చేతకానివాళ్ళు మైకుల్లో దేవుడి పేరిట స్తుతులకు బదులుగా సుత్తులు చెల్లిస్తున్న ఈ రోజుల్లో ఆ మాత్రం నోరుచేసుకోలేవుటయ్యా? నోరు చేసుకోవడానికి జంకితే ఊరు మీది కాకుండా పోతుంది. చెప్పుకోవడానికి సంకోచించే నపుంసకత్వంనుండి మీరు బయటపడాలి. ధర్మబోధకు కావలసింది సత్ప్రవర్తనగాని, చెప్పడంలో హొయలుకాదు."

"మీరు చరచిన వెన్నుచరుపు నా వెరపును పోగొట్టింది. కర్తవ్యానికి సిద్ధమవుతున్నాను" అన్నాడతను చేతులు జోడిస్తూ.

గురించి చెప్పడం చాలదు,
గురి ఉంచి నడవడం కావాలి.

"ఒక మహాపురుషునిపేర మనం ఒక బృందంగా ఏర్పడడం, ఆయనను స్మరించుకోవడం, ఆయన అనుయాయులుగా మనను భావించుకోవడం మంచి విషయాలు. కానీ మనదేశంలో ఇలాంటి బృందాలు ఎక్కువభాగం సమావేశాలకే పరిమిత మవుతున్నాయి. వారానికో, పదిహేను రోజులకో ఒకచోట జేరడం, తాము నమ్మిన మహానుభావుణ్ణి గురించి నాలుగు మంచి ముక్కలు చెప్పుకోవడం, అనుభూతి చెందడం, తిరిగి ఇళ్ళకు చేరుకోవడం, ఎప్పుడైనా ఉత్సవాలు, పర్వదినాలు పెద్ద ఎత్తున జరుపుకుంటూ ఉండడం - ఈ మాత్రమే చాలదు.

"మనదేశంలో జరుగుతున్న చిత్రమేమిటంటే విప్లవాన్ని కోరేవారు అప్పుడప్పుడు తమ ఆవేశాలను వెళ్ళగక్కి ఊరుకొంటున్నారు. ఆస్తికుల మనుకునేవాళ్ళు వార్షికంగానో, అర్ధవార్షికంగానో ఒకచోట గుమిగూడి హడావిడిగా తొక్కిసలాడి తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాం అనుకుంటున్నారు. రెండు సందర్భాల్లోనూ జాతి కర్మనిష్ఠను పొందలేకపోతున్నదని స్పష్టంగా తెలుస్తున్నది. ఏ పేరుతో పిలవబడితేనేం, జరుగుతున్నదిదే.

"ఒక మహానుభావుడికి మనమెందుకు నమస్కరిస్తున్నాం? ఆయన చేసిన త్యాగాలకు, చూపిన సత్ప్రవర్తనకు

ముచ్చటపడి నమస్కరిస్తున్నాం. ఆ గుణగణాలను గూర్చి వివరించుకొంటూ మురిసిపోతున్నాం. నేనేమంటున్నానంటే, వివరించడం చాలదూ, ఆ గుణగణాలను వరించడం, జీవితంలో అలా చరించడం కావాలీ అని. గురించి చెప్పడం చాలదు; గురి ఉంచి నడవగలగాలి. అలా జరగనప్పుడు మన జీవితాలకు సార్థకత లేదు.

"ఒక మహావ్యక్తికి నమస్కరిస్తున్నప్పుడు ఆ వ్యక్తిలా మనం జీవించగలిగితే మనకూ, ఆ మహాపురుషునికీ కూడా జనన మరణాతీతమైన లోకాలలో ప్రాణప్రతిష్ఠ జరుగుతుంది. అలా జీవించకుండా ఆ మహాపురుషుని పేర కాలక్షేపం మాత్రమే చేస్తున్నప్పుడు మిగిలిన లోకం మనతోపాటుగా ఆ మహాపురుషుణ్ణి కూడా గేలిచేయడానికి ప్రయత్నిస్తుంది. మనం ఉండవలసిన తీరులో ఉండలేకపోతున్నందుకు సమాజ రూపంలో ఉన్న సర్వాంతర్యామి పరిహాస పూర్వకంగా మనల్ని ఎత్తిపొడుస్తున్నాడని, మందలిస్తున్నాడని మనం గ్రహించాలి. కర్తవ్యనిష్ఠుడైన వాడు ఏ వాదానికి చెందిన వాడైనా, ఏ వర్గానికి చెందినవాడైనా అందరిచేతా గౌరవింప బడతాడు" అంటూ కర్తవ్యాన్ని బోధించారు ఒకఆధ్యాత్మిక సోదరబృందాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ కృష్ణస్వామి.

ధర్మసంస్థాపన అంటే ధర్మసంస్థల స్థాపనా?

ఒకసారి సామాజిక పరిస్థితులను సమీక్షిస్తూ, సహచరులతో చిరునవ్వుతో ఇలా అన్నారు కృష్ణస్వామి -

"భగవానుడు ధర్మసంస్థాపన జరగాలి అంటే మనవారు ధర్మసంస్థల స్థాపన జరగాలని తాపత్రయపడుతూ ఉంటారు. ఒకసంస్థను స్థాపిస్తే సమస్తాన్నీ ఉద్ధరించేస్తున్నా మన్నంత భ్రమను పొందుతూ ఉంటారు. జరగవలసింది సంస్థాపన గాని, సంస్థల స్థాపన మాత్రమే కాదు సుమా! ధర్మసంస్థాపన జరగవలసింది మానవుల హృదయాల్లో. అది, చెబుతున్నవారి పవిత్రత, ప్రవర్తనల వల్ల జరుగుతుందితప్ప, సంస్థలవల్ల జరగదు. సంస్థలు పని జరపడానికి ఉపకరణాలు మాత్రమే. పని చేతకానివాడికి ఉపకరణం ఉండీ ఏం లాభం? పరీక్ష వ్రాయలేకపోతున్నవాడి చేతిలో మంచి కలంలా అది వెలవెల బోదూ?

"ఇంకో ప్రమాదం కూడా ఉంది సుమా! 'లోకా స్సమస్తా స్సుఖినో భవన్తు' అని మన పెద్దలంటే లోకంలోని మన సంస్థ సుఖంగా ఉంటే చాలు అని మనం అనుకుని సరి పెట్టుకోవడమో, ఉరి పెట్టుకోవడమో జరగవచ్చు. సరిపెట్టు కోవడం అంటే మనసంస్థ మనకు చాలునని మిగిలిన సంస్థలను ఉపేక్షించడం. ఉరి పెట్టుకోవడమంటే మన సంస్థకన్న గొప్పది మరి లేదు అని మిగిలిన సంస్థలను ఆక్షేపించడం. ఇంతకీ ఇదంతా కలిలక్షణం. మనందరం కలిసి ఉండకుండా చూడడమే ఆకలిలక్షణం."

సాధించలేనివారు సాధిస్తారు

ఒకసారి కృష్ణస్వామి సహాచరులకు హితవు చెబుతున్నారు- "తన ప్రవర్తనమీద దృష్టిలేని వాడు ఇతరుల ప్రవర్తనమీద దృష్టి పెడుతూ ఉంటాడు. అది బస్సు నడుపుతున్నవాడు తన డ్రైవింగ్ గురించి చూసుకోకుండా అటు ఇటు పోతున్న బస్సు డ్రైవర్ల డ్రైవింగ్‌ను పరిశీలిస్తూ ఉండడంలాంటిది. దీనికి ఫలితం ప్రమాదాలు జరగడమే. వివేకవంతుడైన డ్రైవరు తన డ్రైవింగ్‌పైన, తాను వెళ్ళుతున్న పథంపైన చక్కటి దృష్టితో నిష్ఠతో ఉంటాడు. వివేకవంతుడైన మనిషి ప్రవర్తన కూడా సరిగ్గా ఇలాగే ఉంటుంది. తన కర్తవ్యంపైన దృష్టి ఉంటుంది తప్ప, ఇతరుల కర్తవ్యనిర్వహణ గురించి అభిప్రాయాలు అతనివద్ద వినిపించవు.

తనకు పనంటూ ఒకటి ఏర్పాటు చేసుకోనివాడే 'పీ డిలా వా డలా' అంటూ కాలాన్ని కాలుస్తూ ఉంటాడు. 'అది సరే, నీవు సాధిస్తున్నదేమిటి?' అని ప్రశ్నిస్తే, సమాధానం శూన్యం. అసలు చేయనివాడికన్న కాస్తో కూస్తో తప్పో ఒప్పో చేస్తున్నవాడు నయంకదూ! అసలు చేసే స్వభావం అంటూ ఉంటే ఇవాళ కాకపోతే రేపైనా దారిన పడతాడు. ఇతరులను గూర్చి చర్చించే స్వభావం ఉన్నవాడు ఒకపట్టాన ఆ ఊబినుండి బయటపడడం కష్టం. ఈ లోకంలో

రెండు తరహాల వాళ్ళుంటారు. సాధించేవారు కొందరు, వారిని గూర్చి 'సాదించే'వారు కొందరు. సాధించలేనివాడు 'సాదిస్తూ' కూర్చుంటాడు" అన్నారు నవ్వుతూ.

పనికిరానివాడు పనికి రానివాడే

ఒకసారి సోదరబృందంతో ఇష్టాగోష్ఠిలో ఉన్నారు కృష్ణస్వామి. జరుగుతున్న కార్యక్రమాల గురించి, వాటిల్లో పాల్గొంటున్న, పాల్గొనలేకపోతున్నవారి గురించి మాటలు సాగుతున్నాయి. ఉన్నట్టుండి కృష్ణస్వామి ఒకరివైపు తిరిగి, "ఇంతకూ ఈ లోకంలో పనికిరానివాడు ఎవరు?" అని ప్రశ్నించారు.

అందరూ ఆ ప్రశ్నకు చిత్రమైన ఆశ్చర్యంతో ఆయన వంక చూస్తున్నారు. ఆయనిలా అన్నారు- "పనికిరానివాడెవడో తెలుసా? పనికి రానివాడే."

అందరూ నవ్వేశారు.

"నిజానికంతే కదా! ఎన్ని తెలిసినా, ఎన్ని శక్తియుక్తులున్నా ఆ వ్యక్తి పదిమందికి పనికొచ్చే మంచిపనికి వాటిని వినియోగించలేనప్పుడు వ్యర్థమే కదా! అందుకే చెప్పాను- తెలివితేటలు, సిరిసంపదలు మొదలైనవాటి ఎక్కువ తక్కువలతో నిమిత్తం లేకుండా పనికి రాని ప్రతివాడూ పనికిరానివాడేనని." ఈ నిర్వచనం అందరికీ నచ్చింది.

ఎంచేవాడు కాదిపుడు పెంచేవాడు కావాలి

సహచరులతో సంభాషణలో ఉన్నారు. కృష్ణస్వామి సంభాషణ అటుతిరిగి ఇటుతిరిగి ఒకరిద్దరు, అక్కడ లేని సోదరులను గూర్చి, అతనిలా చేశాడు, ఇతనలా చేశాడని ఏకరువు పెట్టసాగారు. అన్నీ సావధానంగా విని, కృష్ణస్వామి ఇలా అన్నారు.

"ఎంచడం తేలిక; పెంచడం కష్టం. ఎంచడానికి లోపాలు ఎవరిలో దొరకవు ? ఎంచేవాడి దృష్టి మనిషిలోని చెడు మీద పడుతుంది. పెంచదలచినవాడి దృష్టి ఎదుటి మనిషిలోని మంచిమీద లగ్నమవుతుంది. ఎంచదలచినవాడు మనిషిలోని చెడును చెరిగిపోస్తాడు. పెంచదలచినవాడు మనిషిలోని మంచికి కుదురు చేసి, నీరుపోసి, తోటమాలిలా పెంచుకొంటాడు. ఎంచదలచినవాడు మనిషిలోని మంచిని విస్మరిస్తాడు. పెంచదలచినవాడు మనిషిలోని చెడును ఉపేక్షిస్తాడు. మనకిప్పుడు కావలసింది ఎంచేవాడు కాదు, పెంచేవాడు. ఎంచే ప్రయత్నంలో అవతలి మనిషి విరోధి అవుతాడు. పెంచే ప్రయత్నంలో అవతలి వ్యక్తి ఆత్మీయుడై, క్రమంగా అర్హతను పెంచుకొంటాడు. మీరందరూ నాకెందుకు ఆత్మీయులయ్యారు ? ఆలోచించండి. మీతోడివారు మీకు ఆత్మీయులయ్యే అదృష్టానికి మీరూ నోచుకోండి."

కృష్ణస్వామి ఆర్ద్రంగా చేసిన ఈ వివరణ సహచరుల హృదయాలను ఆకట్టుకొని, వారి కన్నుల పొరలను కరిగించివేసింది.

తెలుగు కష్టం ఇంగ్లీషు 'కష్టమ్' (Custom) గా మారాలి

సమాచరుడొకడు "రోజూ ఆరుగంటలకి ప్రేయరుకి రావాలి అంటే కొంచెం కష్టమే అవుతోందండి. పనులు రోజూ ఒకేలా ఉండవు కదా!" అన్నాడు.

కృష్ణస్వామి నవ్వుతూ, "మీరు చెప్పిన తెలుగు కష్టం కొంచెం శ్రద్ధపెడితే ఇంగ్లీషు 'కష్టమ్' (Custom)గా మారిపోతుంది. ఇంగ్లీషులో కష్టమ్ అన్నమాటకు ఆచారమని కదా అర్థం! ఒక మంచిపని రోజూ ఒకే వేళకు చేయడం మొదటిలో కష్టం అనిపించినా, శ్రద్ధపెట్టి ఏదో ఒకలా రోజూ ఆ వేళకు ఆపనిని చేయసాగితే క్రమంగా అది ఆచారంగా రూపొందుతుంది. అప్పుడిక మానమన్నా ఆ పనిని మానలేరు మీరు" అంటూ చమత్కరించారు.

శిలలు చాలా ఉన్నాయి - శిల్పులే కావాలి

పేమంటుగా పరిచయమైన ఒకాయన కృష్ణస్వామికి సన్నిహితులయ్యారు. ఆయనకి పదిమందికి సేవ చెయ్యాలనే తపన ఉంది. కానీ కంగారెక్కువ. తోడివాళ్ళు ఆయనకి హడావిడి ఎక్కువ అని ఆక్షేపిస్తూ ఉండేవారు. 'మాస్టర్ ఆఫ్ కన్ఫ్యూజన్' అనే బిరుదు కూడా ఇచ్చేశారు. కృష్ణస్వామి ఆయనని చేరదీసి, ఆ కంగారుకు హోమియోమందు వేసి, మెల్లగా లైన్లో పెట్టడం ప్రారంభించారు. అతను మందుల్లు

కట్టడం దగ్గర్నుంచి, వైద్యాలయ నిర్వహణం వరకూ చాల తక్కువకాలంలో చేయితిరిగిన వాడయ్యాడు. మొదటి దశలో ఆయన్ని చూసిన సహచరుడొకరు "చిత్రంగానూ, ఆశ్చర్యంగానూ ఉంది. ఎంతలో ఎంతమార్పు!" అని ఆనం దాన్ని ప్రకటించగా కృష్ణస్వామి ఇలా అన్నారు-

"శిలలు చాలా ఉన్నాయి, శిల్పులే కావాలిపుడు. మంచిపని చేద్దామని, పదిమందికి పనికిరావాలని అభిలషించే వారి సంఖ్య బాగా పెరుగుతోంది. వారిని తీర్చిదిద్దగల సమర్థులే ఎక్కువ సంఖ్యలో మనకిప్పుడు కావాలి. వ్యక్తులు తీర్చిదిద్దబడాలి అంటే దిద్దదలచినవాడు మొదట ప్రేమ స్వరూపుడై ఉండాలి. ప్రేమ లేనిదే సహనం అబ్బదు. సహనం అబ్బనిదే సామర్థ్యం రాణించదు. అందులోనూ రూపురేఖలు దిద్దవలసింది జీవశిల్పాలకు కదా! కదులుతున్న తెరమీద బొమ్మ గీయగలవాళ్ళిప్పుడు కావాలి."

ఆత్మవిద్య - అసలురూపం

మూలాధారం - మూలే ఆధారం

అవనిగడ్డ గాలిగోపురం గుళ్ళో కృష్ణస్వామి భాగవత ప్రవచనం సాగుతోంది. భీష్మస్తుతి ఘట్టం అనుభూతి ప్రదంగా, అంతరార్థసహితంగా నడుస్తోంది. నిర్యాణానికిముందు భీష్ముడు చేసిన ఆ స్తుతిలోని యోగవిద్యారహస్యాలను అలవోకగా, ఆనందదాయకంగా వివరిస్తూ, "యోగవిద్యను ఇలా భాగవతమార్గంలో, వ్యాసుని అడుగుజాడల్లో వివరించు కొంటేనే అర్థమవుతుంది; జీవితం అర్థవంతమూ అవుతుంది. ఇలా కాక మూలాధారం, స్వాధిష్ఠానం అంటూ పొడిపొడిగా మొదలుపెడితే, జనానికి అందనూ అందదు; జనం మనకి అందనూ అందరు. మూలాధారం అని మొదలు పెట్టిన మనకు గుడిలో ఒకమూలే ఆధారం అవుతుంది" అంటూ చెణుకు విసిరారు కృష్ణస్వామి.

ప్రసంగం మంచి పాకాన ఉందేమో, చెణుకులోని సత్యం ఇట్టే బోధపడింది శ్రోతలకి.

6. ఆత్మవిద్య – అసలురూపం

- మూలాధారం మూలే ఆధారం.
- చేయవలసింది నిందించడం కాదు, అందించడం
- అడిగేసేవారుకాదు, అడుగువేసేవారు కావాలి.
- వదిలించుకోవడంకాదు, వదులుగాఉంచుకోవడం
- వదలవలసింది బంధువులను కాదు, బంధాలను
- పట్టించుకోకపోవడంకాదు, పట్టిఉంచుకోకపోవడం.
- బిడ్డలు లాగివస్తే బెడ్డలు
- తెలుగుసంసారం హిందీ సంసారం కావాలి
- అశాశ్వతంకాదు 'ఆ' శాశ్వతమే
- కలిసిబ్రతకండి, ఒకటిగా తెలిసిబ్రతకండి
- ఆత్మదర్శనం 'ఐక్యత'కోసమే
- పరమహంస - పరమహింస
- సామగ్రి అదే - సంస్కారమే వేరు
- నాదాన్ని వినకపోతే నినాదాన్ని వినవలసి వస్తుంది.

చేయవలసింది నిందించడం కాదు అందించడం

"ఈ రోజుల్లో వేదా లెవడికి కావాలి? ఉపనిషత్తులు, పురాణాలు చదివేవాడెవడు? సంస్కృతం ఎంతమంది నేర్చుకుంటున్నారు? బంగారంలాంటి మన సంస్కృతినిగూర్చి పట్టించుకొంటున్నవాడెవడు? ఈ దేశం ఎటువైపు వెళుతోంది? ఏమైపోతుంది?" అంటూ సభల్లో కొందరు పెద్దలు బాధతో నిందిస్తూ, నిందిస్తూ బాధపెడుతూంటారు. అది సరే గాని, వేదాల్లో ఉన్నదేమిటో ఉపనిషత్తులేమి చెబుతున్నాయో, పురాణాలతరహా ఏమిటో ఈ ప్రజలకు అర్థమయ్యేటట్టు చెప్పవలసిన బాధ్యత ఆ పెద్దలకు లేదా? అర్థమయ్యేటట్టుగా చెబితే కొంతమంది వింటారు. నిత్య జీవితానికి సమన్వయించి, జీవితాలను వెలిగించుకోగలిగేటట్టు చెప్పగలిగితే ఎంతోమంది వింటారు. కాబట్టి నిందించడం కాదు చేయవలసింది, తగినరీతిలో అందించడం.

"తగిన రీతిలో అందించాలి అంటే శిక్షణ, తపస్సు చాలా అవసరం. సామాన్యంగా మనం మనకు అర్థమయ్యింది చెబుతాం గాని, వినేవాళ్ళకు అర్థమయ్యేలా చెప్పలేం. మనకి తెలిసింది ఏకరువు పెడుతూంటాంగాని, వినేవారికి కావలసింది ఏమిటో, ఎంతవరకో గ్రహించుకోలేం. పెట్టెలను వదలిపెట్టి వెళ్ళిపోతున్న ఇంజనులా వినేవాళ్ళను పట్టించుకోకుండా ఒకపట్టు పట్టేసేవాళ్ళమే ఎక్కువవుందిమి. ఇంకొంత మందికి మైకు దగ్గర కాగానే మైకం కమ్మేస్తుంది. ఆ మైకంతో

వాళ్ళు దేన్లోంచి దేన్లోకి వెళ్ళిపోతారో, ఎక్కడ మునిగి ఎక్కడ తేలతారో దేవుడికే తెలియాలి. ఇలాంటి పొరపాట్ల వల్లనే జనసామాన్యం పవిత్ర వాఙ్మయానికి దూరం అవుతున్నారు. వాళ్ళు అవుతున్నారా? మనం చేస్తున్నామా? ఆత్మపరిశీలన చేసుకోవలసి ఉంది. అర్థమయ్యేటట్టుగా, నిత్యజీవితంలో అక్కరకు వచ్చేటట్టుగా చెప్పగలిగితే ప్రజలు తండోపతండాలుగా జేరి శ్రద్ధగా వింటారన్నది, వినియోగించుకొంటారన్నది అనుభవంలోని సత్యం"అంటూ పెద్దలు నలుగురూ జేరిన ఒక సభలో చివరివక్తగా నోరు చేసుకొన్నారు కృష్ణస్వామి.

అడిగేసేవారు కాదు, అడుగువేసేవారు కావాలి

ఒక గ్రామంలో సేవాకార్యక్రమ నిర్వహణలో ఉన్నారు కృష్ణస్వామి. మధ్యలో ఆయన కొంచెంసేపు విరామానికని ఇవతలికి వచ్చారు. ఇదేసందని ఒక ముగ్గురు వ్యక్తులు కృష్ణస్వామి దగ్గరకు చేరారు. ఆధ్యాత్మిక సాధనకు సంబంధించిన కొన్ని పడికట్టురాళ్ళ వంటి ప్రశ్నలు వేస్తూ 'వీటికి మీరేం చెబుతారు?' అన్నట్టు చూడసాగారు.

"ఈ ఊరు వస్తున్న పెద్దలందర్నీ ఇవే ప్రశ్నలు వేస్తూ వస్తున్నారుకదా, ఎవరినుండీ మీకు కావలసిన జవాబులు లభించలేదా?'' అన్నారు కృష్ణస్వామి.

ఆ వ్యక్తులు కొంచెంగా అదిరిపడ్డారు. అందులో ఒకతను 'ఎవరేం చెబుతారో తెలుసుకోవాలి కదండీ. తెలుసుకోవడం తప్పంటారా?' అన్నాడు.

"తెలుసుకోవడం తప్పుకాదు గాని, తెలుసుకొన్నట్టు నడుచుకోకపోవడం తప్పు. ఊరికే తెలుసుకొంటూ కూర్చోవడం వల్ల ఉపయోగమేముంది?"

"మీరు చెప్పింది నిజమేననుకోండి. ఈ విధమైన జిజ్ఞాస ఉండడం తప్పంటారా?" అన్నాడు మరొకతను.

"మీ జిజ్ఞాస ఎంతటిదో నాకు తెలుసు. వచ్చినవారి పరిజ్ఞానాన్ని పరీక్షించడానికి మీరు అడుగుతున్నారు తప్ప, నేర్చుకోవడంకోసం కాదని కూడా నాకు తెలుసు. నాకిప్పుడు కావలసింది అడిగేసేవారు కాదు; నాతోపాటుగా అడుగు వేసే వారు. లోకశ్రేయస్సుకై ధర్మమార్గాన నడవడానికి ఇష్టపడిన వారికి మాత్రమే 'నా' నుండి సమాధానం పొందడానికి వీలవుతుంది. ఇది అహంకారం కాదు. నన్ను నడుపుతున్న వెలుగును గూర్చిన పవిత్రమైన భావం మాత్రమే. అందుకోడానికి సిద్ధపడినవాళ్ళను మాత్రమే ఏ కాలంలోనైనా ఆ వెలుగున్వ్రశిస్తుంది. సిద్ధపడకుండా తెలుసుకోగోరిన వారికీ, పరీక్షించడానికి పూనుకొన్న వారికీ దానిని గూర్చిన అభిప్రాయాలే దక్కుతాడు. సెలవు" అంటూ సేవలోనికి మళ్ళీ చొరబడ్డారు కృష్ణస్వామి.

ఆ వ్యక్తులు అటూ ఇటూ చూసి వచ్చిన త్రోవ పట్టారు.

(9)

వదిలించుకోవడం కాదు, వదులుగా ఉంచుకోవడం

ఒకసారి పర్యటనలోనున్న కృష్ణస్వామిగారిని కలిసిన వారి బంధువొకరు తమ కుటుంబ విషయాలను ఆయనకు ఏకరువు పెడుతూ "ఈ పిల్లలందరికీ ఎవరిదారి వారికి చూపించి, ఎంత తొందరగా వదిలించుకుంటే అంత మంచిదని చూస్తున్నానయ్యా" అన్నారు విసుగ్గా.

కృష్ణస్వామి నవ్వుతూ, "చేయవలసింది, వదిలించుకోవడం కాదు, వదులుగా ఉంచుకోవడం. అది కూడా మనం వాళ్ళని వదిలిపెట్టడానికి కాదు. ఏకారణంచేతనైనా వాళ్ళు మనల్ని వదిలిపెడితే దుఃఖించకుండా ఉండడానికి."

ఆ బంధువు ఆశ్చర్యంగా చూస్తూనే ఆలోచనలో పడ్డాడు.

వదలవలసింది బంధువులను కాదు- బంధాలను

ఒకసారి ఒక నడివయస్కుడు "ఈ ఇంట్లో గొడవలతో పడలేకపోతున్నాను. వీళ్ళందర్నీ వదిలి ఏ భద్రాచలమో వెళ్ళిపోదామనుకుంటున్నాను. అక్కడ పడిఉంటే ఏదో వేళ్టికి ఆ మాత్రం ముద్ద దొరక్కపోతుందా?" అంటూ వైరాగ్యాన్ని అభినయించాడు.

కృష్ణస్వామి ఇట్లా అన్నారు :

"వెళ్ళక వెళ్ళక భద్రాచలమే వెళతావా? వెళ్ళి రాముడికి దణ్ణం పెడితే, రాముడేమని అడుగుతాడో తెలుసా

'నీ వొక్కడివే వచ్చావేం ? కుటుంబమేది ? నేను చూడు-అరణ్యవాసానికి కూడా భార్యతోనూ, తమ్ముడితోనూ కలిసి బయలుదేరాను. ఇప్పుడు నీవు దణ్ణం పెడుతున్నచోట కూడా మేం కలిసే ఉన్నాం. కలిసి ఉండడం ఎలాగో నేర్చుకోవడానికే మీరు మాదగ్గరకు రావలసింది' అంటాడు."

అతను కొంచెం సిగ్గుతో తలవంచుకొన్నాడు.

కొంచెం ఆగి, కృష్ణస్వామి, మళ్ళీ ఇలా అన్నారు - "వదలవలసింది బంధువులను కాదయ్యా, బంధాలను. బంధాలు బయట ఉండవు. మన మనస్సులో ఉంటాయి. మనతో ఉంటున్నవారిపైన అభిప్రాయాల రూపంలో ఏర్పడి, మనని బిగిస్తూ ఉంటాయి. సన్న్యసించవలసింది వాటిని. చేతనవుతుందేమో చూడు. అది చేతనయితే ఎక్కడున్నా ఒకలాగే ఉంటుంది.

పట్టించుకోకపోవడం కాదు,
పట్టి ఉంచుకోకపోవడం

"ఏది ఎలా జరిగితే అలా జరుగుతుంది. ఎవడెలాపోతే అలా పోతాడు. ఎవళ్ళ విధికి ఎవళ్ళు కర్తలు! అని అనిపించి ఈమధ్య జరుగుతున్నవాటిని పట్టించుకోవడం మానేస్తున్నాను" అన్నారొకరు, కృష్ణస్వామితో విరక్తిగా ముఖం పెట్టి.

కృష్ణస్వామి ఇలా అన్నారు - "చేయవలసింది పట్టించుకోకపోవడం కాదు; పట్టి ఉంచుకోకపోవడం. పట్టించుకోవలసింది పట్టించుకోకపోవడం కర్మ భ్రష్టత అవుతుంది తప్ప వైరాగ్యం కాదు. పట్టించుకోవలసినవి తప్పకుండా పట్టించుకోవాలి. ఆయా కర్తవ్యకర్మలను శ్రద్ధతో నిర్వహించాలి. నిర్వహించిన తర్వాత, జరిగిన సన్నివేశాలను గూర్చిన అభిప్రాయాలను మాత్రం మనస్సులో పట్టి ఉంచుకూడదు. పట్టి ఉంచుకుంటే మనస్సు ఒత్తిడి ననుభవిస్తుంది. దీనినే బంధం అంటారు.

"నిరంతర కర్మాచరణలో ఉండేవాడికి పట్టి ఉంచుకునే ఖాళీ ఉండదు. పనికీ పనికీ సందున్నప్పుడు మాత్రమే అభిప్రాయాలనే బుడగలు పుట్టుకొస్తాయి. సందివ్వని కార్యకర్మ నిర్వహణలో నిమగ్నం కాగలిగినపుడు మాత్రమే మానవ జీవితానికి సహజమైన హాయి, నిండైన తృప్తి దొరుకుతాయి. ఈ దివ్యస్థితినే మోక్షస్థితి అంటారు. కనుక వైరాగ్యం పేరిట సోమరితనాన్ని వరించకుండా కర్తవ్యాన్ని శ్రద్ధతో నిర్వహించండి."

బిడ్డలు లాగి పట్టే బెడ్డలు

ఆ మధ్యనే తమకు కలిగిన మగబిడ్డను తీసుకుని కృష్ణస్వామిని చూడవచ్చారు ఒక దంపతులు. యోగక్షేమాలయిన తరువాత ఇష్టాగోష్ఠి నడుస్తోంది.

"ఈమధ్య బయటికి వెళ్ళే అవకాశమే అంతగా కలగడం లేదండి. ఇద్దరం కలిసి బయటికి వెళ్ళడం అంటే

గగనమయిపోతోంది. బాబు పుట్టిన తర్వాత ఇదివరకటి రొటీనంతా మారిపోయిందంటే నమ్మండి. ఎక్కడికైనా వెళ్ళాలంటే వీడితోసహా వెళ్ళాలి కదా! ఆమాత్రం ఈమాత్రం వాతావరణం, నీళ్ళుమారితే వీడి ఆరోగ్యంలో ఏం తేడా వస్తుందోనని భయం" అందావిడ.

ఆమె మాటలకు ఆయన వంతపలుకుతున్నాడు.

కృష్ణస్వామి నవ్వుతూ ఇలా అన్నారు -

"బావుంది మీ కథ. పొట్లపిందెల చివర రాతిబెడ్డలు కడుతూ ఉంటారు, ఎందుకో తెలుసా? వంకర్లు తిరిగి చిన్నవై పోకుండా, సాగి పెద్దవి కావాలని. ఈ బిడ్డలు మనల్ని అలా లాగి పట్టే బెడ్డలు సుమా!

"మీరే ఉన్నారనుకోండి! ఈ బిడ్డకలగకముందు మీ విహారాలకి ఎవరైనా అడ్డు చెపితేమాత్రం ఆగేవారా? ఆరోగ్యానికి మంచిది కాదని హెచ్చరించినా మానేవారా? ఆ ఉత్సాహం అలాంటిది. ఇపుడు బిడ్డకలిగాక ఇదివరకటిలా తిరగండి అన్నా తిరగ్గలరా? చూశారా, బిడ్డవల్ల మీ జీవితాలకు స్పీడు తగ్గి క్రమశిక్షణ వస్తోంది! భగవంతుడు సందేశాల ద్వారా కాక, సన్నివేశాలద్వారానే మనకెక్కువ నేర్పుతూ ఉంటాడు సుమా!"

ఆ దంపతులు మీరు చెప్పింది నిజం అంటూ నవ్వుతూ సిగ్గుపడ్డారు.

తెలుగు సంసారం హిందీ సంసారం కావాలి

ఒకరోజు రాత్రి సన్నిహితులొకరు కృష్ణస్వామిని జేరి కష్టసుఖాలు చెకుప్పుంటూ "ఏమిటోనండీ, ఎంతసేపూ ఈ సంసారం ఈ గొడవలతోనే సరిపోతోంది. దైవచింతనకి పట్టుమని పదినిమిషాలుకూడా సందుదొరకడంలేదు" అంటూ నిట్టూర్చారు.

కృష్ణస్వామి చిరునవ్వుతో ఇలా అన్నారు -

"ఇంతకూ ఈ సంసారాన్ని విడిచిపెట్టేస్తే దైవచింతన తీరిగ్గా చేసుకోవచ్చునా మీ ఉద్దేశం ? జరగవలసింది అది కాదు. మీ తెలుగు సంసారం క్రమంగా హిందీ సంసారం కావాలి. దైవచింతనకు పరమావధి అదే."

వింటున్న వ్యక్తి ఆశ్చర్యంగా చూశాడు.

కృష్ణస్వామి ఇలా వివరించారు :

"హిందీలో 'సంసార్' అంటే ఏమిటి? ప్రపంచమని అర్థం. ప్రపంచమే మన కుటుంబమన్న విశాల భావాన్ని అనుభవంలో పొందడమే ఆధ్యాత్మిక చింతనకు పరమావధి. మనం పెద్దవాళ్ళని చెప్పుకుంటున్నవాళ్ళూ, దేవుళ్ళుగా పూజించుకుంటున్నవాళ్ళూ అందరూ ప్రపంచాన్ని తమ కుటుంబంగా దర్శించి, దానికోరకు బాధ్యతతో పనిచేసిన వారే. అందుకే వాళ్ళకు మనం నమస్కరించడం. మనం

నమస్కరించినపుడల్లా మనకూడా వాళ్ళలాగ మనస్కరించాలని ఆ పెద్దలు ఆశీర్వదిస్తూ ఉంటారు. ఆలుబిడ్డలే కుటుంబమనే సంకుచితదృష్టి నుండి జీవులందరూ తమ కుటుంబ సభ్యులనే విశాలదృష్టిని అలవరచుకోనేటందుకే మనం యోగసాధన చేయవలసింది.

"నాకు ఒకందుకు నవ్వు వస్తూ ఉంటుంది. ఆలుబిడ్డలకు మాత్రమే తనను పరిమితం చేసుకొన్న మనిషి వారితోటి సహజీవనంలోనే ఒడుదుడుకులు వస్తున్నాయని సోలిపోతున్నాడు కదా, శోకిస్తున్నాడు కదా! మరి, ప్రపంచమంతా తమకుటుంబమని బాధ్యతపడి పనిచేస్తున్న ఆ పెద్దవాళ్ళేమనుకోవాలి ?

"అసలు మనం అనుకుంటున్న ఈ చిన్న కుటుంబం మనచుట్టూ ఎందుకుంటుందో తెలుసా ? మనం అందుకోవలసిన పెద్దకుటుంబ బాధ్యతకు తగిన శిక్షణ నిచ్చేటందుకే. తల్లిదండ్రులు, అన్నదమ్ములు, ఆలుబిడ్డలు మొదలైనవారితో సహచరిస్తూ చక్కని శిక్షణ పొందినవారే ప్రపంచమనే పెద్ద ఇంటిలో బాధ్యతగల సభ్యులుగా ప్రవర్తించగలుగుతారు. ఈ సత్యాన్నే శ్రీరాముడు తన జీవిత సన్నివేశాలద్వారా మనకు ఉపదేశిస్తున్నాడు. రామాయణాన్ని ఒకసారి ఈ దృష్టితో చదివి చూడండి."

కృష్ణస్వామిగారి వివరణ విని ఆవ్యక్తి క్రొత్తలోకంలోనికి ప్రవేశిస్తున్నటుగా కనిపించాడు.

అశాశ్వతం కాదు 'ఆ' శాశ్వతమే !

"ఏమున్నది? ఈ కనబడుతున్నదంతా అశాశ్వతమే గదా ! మనకు ఆ శాశ్వతమైన వస్తువే ముఖ్యం" అన్నారొక పెద్దవారు కృష్ణస్వామితో.

కృష్ణస్వామి వినయగంభీరంగా ఇలా అన్నారు -

"అశాశ్వతమేమీ లేదు. అశాశ్వతంగా కనిపిస్తున్నది, అనిపిస్తున్నది కూడా ఆ శాశ్వతమే. సృష్టిగా వ్యక్తమైనది కూడా పరమాత్మే అయినపుడు వ్యక్తస్థితిని అశాశ్వతమని ఎలా అనగలం ?

"సముద్రం అలగా వ్యక్తమవుతున్నది. సముద్రమూ అలా కూడా వేరుగా కనబడుతున్నాయి. అల పైకివచ్చి, ఒడ్డుకు తగిలి, తిరిగివెళ్ళి కలిసిపోయేదిగాను, సముద్రం శాశ్వతమైనదిగాను మనకు అనిపిస్తూ ఉంటుంది. నిజానికి అల సముద్రం కన్న వేరుగా ఉంటుందా ? సముద్రంయొక్క రూపాంతరమేగదా అల ! అలగా ఉన్నది కూడా సముద్రమే. మనం అనుకొంటున్న సముద్రం, మనం చూస్తున్న అల కలిసి అసలు సముద్రం. ఈ సత్యాన్ని గమనించినవాడికి అల అశాశ్వతం కాదని తెలుస్తుంది. అల వచ్చిపోయేది కాదు, సముద్రమే అలగా వస్తూ పోతూ ఉంటుంది అన్న దర్శనం లభిస్తుంది.

"అలాగే, పరమాత్మే సృష్టిగా వ్యక్తమవుతూ, ఉపసంహరించుకొంటూ ఉన్నాడు. కనబడుతూ తనలోనికి కరిగి పోతూ ఉన్నాడు. కనుక ఉన్నదీ, కనబడుతున్నదీ ఆ శాశ్వతమే తప్ప అశాశ్వతమనేది ఏమీ లేదు." ఇలా కృష్ణస్వామి తత్త్వజ్ఞానపు లోతులకు వెళ్ళి చేసిన వివరణ విని, "మీరు వివరించిన అంశం ధ్యానం చేయవలసిందే సుమా!" అన్నారా పెద్దాయన.

కలిసి బ్రతకండి, ఒకటిగా తెలిసి బ్రతకండి

"'కలిసి ఉంటే కలదు సుఖం' అన్న సామెత మనం వింటూ ఉంటాం. అంటూ ఉంటాం. అయితే కలిసి ఉంటున్న చోట్లల్లో ఎక్కడో తప్ప సుఖం కనబడటం లేదు. చాలాచోట్ల అభిప్రాయ భేదాలో, సాధించుకోవడాలో, ఒకరి నొకరు ఎంచుకోవడాలో, ఎక్కువతక్కువలు ఊహించుకోవడాలో కనబడుతుంటాయి. మరి, కలిసి ఉంటే కలదు సుఖ మన్న మాట ఏమైంది ? ఆ మాట ఒట్టిదేనా ? కాదుగాని, కలిసి ఉంటేనే చాలదు. తామంతా ఒకే వెలుగు యొక్క వ్యక్తరూపాలని తెలిసి ఉన్నప్పుడు మాత్రమే సుఖం లభిస్తుంది. తోడి వ్యక్తిలో వ్యక్తిని కాక, వెలుగును దర్శించగల నైపుణ్య మబ్బాలి. అప్పుడు మాత్రమే సహవాసం చిరకాలం నిలుస్తుంది" అంటూ లలితంగా వివరించారు కృష్ణస్వామి, సమాజీవనానికి రాచబాట చూపుతూ ఒక ప్రసంగంలో.

(10)

ఆత్మదర్శనం 'ఐక్యత' కోసమే

"అన్నదమ్ములైనవారు మంచీచెడూ వెనకాముందూ చూసుకోకుండా కీచులాడుకొంటుంటే తెలిసిన పెద్దవాళ్ళు ఏమంటారు? 'అన్నదమ్ములు మీరు. ఒకతల్లికి, తండ్రికి పుట్టినవాడు, ఒకళ్ళ తప్పును మరొకళ్ళు సద్దుకోవడమో, దిద్దుకోవడమో చేసుకోవలసినవాళ్ళు - ఇలా కీచులాడుకొంటూ బజార్న పడటం, జీవితాల్ని దుఃఖమయం చేసుకోవటం పద్ధతేనా? మీలో ఎవరు నష్టపోయినా మీ తల్లిదండ్రులకు ఒకే బాధసుమా' అంటూ పుట్టుకను గుర్తుచేస్తారు. ఎందుకలా చేస్తున్నారు? కనీసం తమ పుట్టుకచోటు ఒకటని తెలియజెప్పినప్పుడన్నా వాళ్ళు కనులు తెరచి, ఆస్తిపాస్తులకు బదులుగా ఆత్మీయతకు చోటియ్యగలరేమో చూద్దామని. అలా ఇచ్చేలా చేద్దామని. అలాగే మానవులు తెగలుగా, వర్గాలుగా, మతాలుగా, పార్టీలుగా, స్త్రీ పురుషులుగా తమను తాము వేరుగా చూసుకొంటూ చెడిపోతున్నప్పుడు ఈ సృష్టి మొత్తం ఒకే వెలుగునుండి వ్యక్తమయిందనీ, మన మందరం ఆ వెలుగుయొక్క రవ్వలమేననీ తెలియజెప్పడం ఎంత అవసరం! ఎన్ని రకాలుగా నచ్చచెప్పినా ఈ దివ్యదర్శనం కలిగినప్పుడు మాత్రమే మనుషుల మధ్య నిజమైన 'ఐక్యత' సిద్ధించి స్థిరపడుతుంది. ఈ 'ఐక్యత'ను అనుభవించి, అనుభవింపజేయడానికే సుమా, మన వాళ్ళు ఆత్మదర్శనాన్ని పొందుతూ, అనుగ్రహిస్తూ వచ్చింది!" అంటూ ఆత్మదర్శనంయొక్క ఆవశ్యకమును' ప్రయోజనాన్నీ మంద్రంగా వివరించారు ఒకప్రసంగంలో.

పరమహంస - పరమహింస

"ఆత్మదర్శనానికి పరమావధి అయిన 'ఐక్యత'ను అనుభవించలేనప్పుడు అనుభవించడానికి సిద్ధంగా లేనప్పుడు పవిత్ర గ్రంథాలెన్ని చదివినా ఉపన్యాసాలూ, విన్యాసాలూ ఎన్ని చేసినా ఒరిగేదేమీ ఉండదు. ఆత్మదర్శనం అనుభవించి అనుభవింపజేస్తున్నవాడు ఋషి అవుతున్నాడు. దానిని అనుభవించకుండా దానినిగూర్చి సాగదీస్తున్నవాడు 'పండితుడు' అవుతున్నాడు. ఇద్దరూ పుచ్చుకొనేది ఒకే గ్రంథాలయినా స్థితిభేదాన్నిబట్టి ఒకరు ఋషిగా మరొకరు 'పండితుడు'గా ఉంటున్నారు.

"ఆత్మదర్శనంద్వారా 'ఐక్యత'ను అనుభవిస్తూ అభిలషించారు గనుకనే, రామకృష్ణాదులు పరమహంసలయ్యారు. ఆత్మదర్శనం కొరకు ఉద్దేశింపబడని ఆచారకాండ నుండి వ్యక్తమయ్యేది పరమహంస కాదు, పరమహింస. దేవుడి పేరు చెప్పేవాళ్ళల్లో పరమహంసల్లా ఉండేవాళ్ళూ ఉన్నారు; పరమహింసగా జీవితాన్ని వ్యక్తం చేస్తూ, లోకాన్ని ఇబ్బందిపెడుతున్నవారూ ఉన్నారు" అంటూ గమ్యాన్ని మరచిన ఆస్తిక్యం ఎలా దెబ్బతింటుందో వివరించారు కృష్ణస్వామి ఒకసారి.

సామగ్రి అదే, సంస్కారమే వేరు

"వివేకవంతుడు రాళ్ళతో ఏం చేస్తాడు? తనకు కావల్సిన విధంగా గృహనిర్మాణం చేసుకుంటాడు. అ

విద్వేషాన్ని పొందినవాడు! ఆ రాళ్ళనే గిట్టనివాళ్ళపై విసిరి కొట్టడానికి వినియోగిస్తాడు. రాళ్ళల్లో తేడా ఏముంది? కాని, వ్యక్తుల సంస్కారాన్నిబట్టి వినియోగం మారుతోంది. పవిత్రగ్రంథాలు కూడా ఈ రాళ్ళలాంటివే. వివేకవంతుడు ఈ గ్రంథాల ద్వారా ఆత్మదర్శనాన్ని పొంది, 'ఐక్యత'ను అనుభవిస్తూ జాతిశ్రేయస్సుకై పనిచేస్తున్నాడు. రాగద్వేషాలు కలవాడు, ఈ గ్రంథాలను పట్టుకొనే, మతభేదాలు సిద్ధాంతభేదాలు గమనించుకొంటూ, కల్పించుకొంటూ, తాను క్షోభిస్తూ, ఇతరులను క్షోభింపజేస్తున్నాడు.

"వివేకవంతుడు వేదాలతో జీవిస్తే, రాగద్వేషాలు కలవాడు వాదాలతో జీవిస్తున్నాడు. వాడికి వేదాల్లో కూడా వాదాలే కనిపిస్తాయి. చూశారా, సంస్కారం ఎంత పని చేస్తోందో! రాగద్వేషాల కతీతులైన మహాత్ముల సన్నిధిలో ఈ కుసంస్కారాలనుండి క్షాళన పొందితే తప్ప, మానవుడికి ఆత్మదర్శనం లభించదు; 'ఐక్యత' సిద్ధించదు. ఈ క్షాళనాన్ని అనుగ్రహించడం కోసమే కాలకాలాల్లో సిద్ధపురుషులు దేహధారులై వర్తిస్తూ ఉంటారు. వాళ్ళు ఋణశేషం వల్ల పుట్టినవాళ్ళుకాదు. ఋణాల కతీతంగా జీవించే మార్గాన్ని మనకి అందించేటందుకు పుట్టినవాళ్ళు. అలాంటి వాళ్ళు పుట్టవలసిన కాలం వర్తించి, దేహాన్ని విడిచినప్పుడు వాళ్ళు మనని ఉద్ధరించడానికి వ్యక్తమై, వర్తించి వెళ్ళారని తెలియక వారికేదో పూర్తికావలసిన కర్మశేషం ఉండి

ఉంటుందని కొందరూ, క్రిందటి జన్మలో పైవరకూ వచ్చి యోగభ్రష్టత చెంది ఇలా పుట్టి ఉంటారని కొందరూ, భూమిమీద మిగిలిన కొద్దిఋణాన్ని తీర్చుకుపోయారని కొందరూ భావిస్తూ వారి కర్మలకు లెక్కలుగట్టి బేరీజు వేస్తుంటారు. వాళ్ళు తమను కర్మబంధాలనుండి సడలించడానికి వచ్చినవాళ్ళని మర్చిపోతుంటారు. మన లెక్కలు తుడిచేయడానికి వాళ్ళొస్తే, మనవాళ్ళు వాళ్ళకి లేనిపోని లెక్కలు కట్టేస్తుంటారు. ఇదొక చిత్రం" అన్నారు కృష్ణస్వామి మానవ స్వభావాన్ని, అతని సంస్కార ప్రభావాన్ని వివరిస్తూ ఒక ప్రసంగంలో.

నాదాన్ని వినకపోతే నినాదాన్ని వినవలసివస్తుంది

"ఏమిటోనండీ, ఎక్కడ చూసినా ఉద్యమాలు, ఊరేగింపులు, నినాదాలు, సమ్మెలు, లాఠీఛార్జీలూను. అంతా గందరగోళంగా ఉంటోంది" అన్నారొకరు కృష్ణస్వామితో.

కృష్ణస్వామి, "ఏం చేద్దాం మరి, నాదాన్ని వినకపోతే నినాదాన్ని వినవలసి వస్తుంది" అన్నారు.

ఆ వ్యక్తి దాని అర్థం ఏమిటా అన్నట్టు చూశాడు.

కృష్ణస్వామి ఇలా వివరించారు:

"అందరిలోనూ, అందరిగానూ, ఉన్నదీ, ఉంటున్నదీ ఒకే వెలుగని తెలిసి, ఆ వెలుగుగా నిలబడగలిగినప్పుడు

సమప్రవర్తన, సత్ప్రవర్తన అలవడతాయి గనుక, సంఘర్షణాలు, సమస్యలు, ఉత్పన్నంకావు. అలా నిలబడలేనప్పుడు భిన్నత్వం గోచరిస్తుంది కనుక, ఆచరణలో అపచారాలు, తత్ఫలితంగా కలవరాలు, కష్టాలు తప్పవు.

"శ్వాసను గమనించి, ఆ శ్వాసగా వ్యక్తమవుతున్న తనను ప్రణవనాదంగా వినగలిగినవాడికి ఆ వెలుగుగా జీవించడం చేతనవుతుంది. సమస్త జీవరాసులుగా వ్యక్తమవుతున్నదీ, సృష్టిగా రూపుకట్టుకొంటున్నదీ ఆ నాదమేనని తెలుస్తుంది. ఈ సృష్టి ఆ నాదవినోదం. ఆ నాదవిలాసం. ఈ సత్యాన్ని ఎరిగినవాడు సర్వత్ర తననే చూసుకొంటాడు. కనుక సమప్రవర్తన, సత్ప్రవర్తన అతనినుండి అప్రయత్నంగా వ్యక్తమవుతాయి. సర్వసమత్వాన్ని అనుభవించడమే అతని జీవిత వైఖరిగా రూపొంది, వైభవంగా వ్యక్తమవుతుంది. ఆ స్థితిలో ఉన్నవాడు తోటివాణ్ణి కులాన్నిబట్టీ, మతాన్నిబట్టీ, ఆస్తిపాస్తులనుబట్టీ, స్త్రీ పురుష భేదాన్నిబట్టీ చూడడు. కేవలం ధర్మదృష్టితో మాత్రమే చూస్తాడు. తననెలా చూసుకొంటాడో ఎదుటివాణ్ణీ అలాగే చూసుకొంటాడు. తనఎడల తాను ఎలా ప్రవర్తిస్తున్నాడో ఎదుటివానిఎడలా అలాగే ప్రవర్తిస్తాడు. ఈ విధమైన సమత్వాన్ని అనుభవించమని సనాతనధర్మం నొక్కిచెబుతోంది. అలా అనుభవిస్తే సంతోషమే. లేనప్పుడు, అనుభవించలేనప్పుడు, అనుభవించడానికి సిద్ధంగా లేనపుడు, అనుభవించడానికి అభ్యంతరాలు

ఉన్నప్పుడు, నాదాన్ని వినని ఆ మనిషి నినాదాన్ని వినవలసి వస్తుంది. లోపల వినబడుతున్న నాదాన్ని విని, సమత్వాన్ని అనుభవించనివాడు బయటనుండి వినబడుతున్న నినాదానికి జడిసి సమత్వాన్ని ప్రయత్నపూర్వకంగా అభ్యసించవలసి వస్తుంది. నాదంగా తనను తాను తెలుసుకోనివాడికి నినాదం తన్ని తెలియజెప్తుంది. నాదం ద్వారానో, నినాదం ద్వారానో, ఎలా బాగుంటే అలా మొత్తంమీద సమత్వాన్ని అభ్యసించక తప్పదు. తాముగా అభ్యసిస్తే ఆధ్యాత్మికత అంటారు. తన్నబడి అభ్యసిస్తే విప్లవం అంటారు. వివేకం ఉన్నచోట విప్లవానికి ఆవశ్యకం ఉండదు. అందుకని కొందరు వివేకాన్ని పెంచే ప్రయత్నం దీక్షగా చేస్తూ ఉంటారు. వీరినే మనం మహనీయులు అంటాం. ప్రవక్తలు అని పిలుస్తాం. ఇంకొందరు వివేకాన్ని పెంచడానికి కాలం చాలా పడుతుందనీ, కనుక విప్లవమే మార్గమనీ భావించి, తగిన ఉద్యమాలు నిర్వహిస్తూ ఉంటారు. భూగోళంలో ఈ రెండురకాల ప్రయత్నాలూ ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి. ఎవరెలా దారికి రావాలో, వారలా దారికి వస్తూ ఉంటారు. ఇవి రెండు మార్గాలు కావు. ఒకేమార్గానికి మనుషుల్ని జేర్చడానికి జరుగుతున్న రెండు రకాల ప్రయత్నాలు. మంచిగా వింటే ముద్దుపెట్టి చెప్పే తల్లే, పద్ధతి తప్పితే, కళ్ళెఱ్ఱజేసి, మొట్టేందుకు పిడికిలి బిగిస్తుంది. ఒకేతల్లినుండి ఈ రెండు స్వభావాలు బిడ్డఎడల వ్యక్తం అయినట్టు ఒకే దైవంనుండి ఆత్మబోధ, విప్లవఘోష

అనే రెండు ప్రయత్నాలు మానవుల్ని మార్గాన నడిపించే టందుకు వ్యక్తమవుతూ ఉంటాయి."

అవతలి వ్యక్తి ఆశ్చర్యంతో కూడిన అనుభూతిని పొంది, "మీ వాక్కు చాలా శక్తిమంతమైనది. పరస్పర విరుద్ధంగా కనిపిస్తున్న అంశాలమధ్య ఏకత్వాన్ని చిత్రంగా దర్శింపచేయగల్గడం, సున్నితంగా వివరించగలగడం, మీ ప్రత్యేకత" అంటూ అనందించాడు.